ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 | సంచిక : 3 | నవంబర్ 2022





ఈ సంచికలో. . . .


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2

శ్రీమద్భగవద్గీత ........................................................ 27

ఇతర విషయములు :

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



నువ్వు ఆత్మని ఒక్కటే చూడు. ఇంక అటు ఇటు చూడకు, దేని గురించి ఆలోచించకు. నీ లక్ష్యం, నీ గురి, నీ శక్తి అంతా ఆత్మ వైపు ఉండాలి. ఉన్నది ఒక్కటే సత్యం. అదే ఆత్మ, అదే భగవంతుడు! ఆత్మ గురించి శ్రవణం చెయ్యగా చెయ్యగా ఆత్మ స్వరూపమే నువ్వుగా ఉన్నావు కాబట్టి అదే నువ్వు అయ్యిపోతావు. అది భగవాన్ మార్గం.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 29 జనవరి 1989, పంజావేమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

**షడాననం కుంకుమ రక్తవర్ణం, మహామతిం దివ్య మయూర వాహనం ।**
**రుద్రస్యసూనుం సురసైన్యనాథం, గుహం సదాహం శరణం ప్రపద్యే ॥**

ఇది సుబ్రహ్మణ్యస్వామి ధ్యాన శ్లోకం. బ్రహ్మణ్యుడు అంటే బ్రహ్మస్వరూపం తెలిసిన వాడు. సుబ్రహ్మణ్యుడు సు అంటే బాగుగా, బ్రహ్మస్వరూపం ఎలా తెలిసిన వాడు? సమగ్రంగా, వెలితి లేకుండా ఫుల్‌గా తెలిసినవాడు. షడాననం అంటే ఆరు ముఖములు కలవాడు. కుంకుమ రక్త వర్ణం అంటే ఎర్రని శరీరం కలవాడు. మహామతిం గొప్ప బుద్ధి కలవాడు. అంటే ఏమిటి? జ్ఞానం కలవాడు. దివ్య మయూర వాహనం ఈయన వాహనం ఏమిటి? గొప్ప ప్రకాశం కల నెమలి వాహనం కలవాడు. మీకు రమణాశ్రమంలో ఎప్పుడూ నెమలులే కనిపిస్తాయి. తరువాత రుద్రస్యసూనుం అంటే ఈశ్వరుని కుమారుడు. ఈశ్వరుని కుమారుడు అంటే ఈశ్వరుని యొక్క అవతారమే సుబ్రహ్మణ్యుడు. సుబ్రహ్మణ్యుడు వేరు ఈశ్వరుడు వేరు కాదు. అరుణాచలేశ్వరుడే సుబ్రహ్మణ్యుడిగా అవతరించాడు. మనం అందరం రమణస్వామి పటం ఇక్కడ పెట్టుకున్నాం. మళ్ళీ వివేకానందస్వామి పటం పెట్టుకున్నాం. ఇంకా మహాత్ముల పటాలు ఇక్కడ పెట్టుకున్నాం. ఈ రమణస్వామి పటం ఇక్కడ పెట్టుకోవడానికి కారణం ఏమిటి? దేవుడు రమణస్వామి హృదయంలో ఎక్కువగా ఉన్నాడా? మీ హృదయంలో తక్కువగా ఉన్నాడా? రమణస్వామి హృదయంలో దేవుడు ఎక్కువగా ఉండి, మీ హృదయంలో దేవుడు కనుక తక్కువగా ఉంటే వాడు దేవుడు అవుతాడా? దేవుడు అందరి హృదయాలలోనూ సమానంగా ఉంటాడు. అయితే మరి మన పటాలు ఎవరు పెట్టుకోవటం లేదు, రమణస్వామి పటమే ఇక్కడ పెట్టుకున్నారు. కారణం ఏమిటి? అది మీరు ఆలోచించాలి. ఎక్కడైతే హృదయం పక్వానికి వచ్చిందో, హృదయం సమగ్రత పొందిందో, ఎక్కడైతే హృదయం వికసించిందో ఆ ఉపాధి ద్వారా దేవుడు వ్యక్తం అవుతాడు. ఇపుడు రమణమహర్షి ఉపాధి ద్వారా, ఆ శరీరంలో ఉన్న హృదయం వికసించటం ద్వారా, అక్కడున్న పరమేశ్వరుడు ఆ దేహం ద్వారా వ్యక్తం అయ్యాడు కాబట్టి మనం రమణ స్వామిని పూజ చేస్తాం. వారిని మనం కారణ జన్ములు అంటాం. అదే విధంగా మీరు కూడా హృదయంలో ఎదిగినప్పుడు, మనస్సు బాగా పక్వానికి వచ్చి రాలిపోయినప్పుడు మీ

హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు కదా వెంటనే ఆయన మీకు వ్యక్తం అవుతాడు. అప్పుడు మీరు దేశానికి, జాతికి అందరికీ దీపం అయిపోతారు. ఒక్క మీ గ్రామానికే కాదు ఒక్క భారతదేశానికే కాదు ప్రపంచంలో ఉన్న జీవులు అందరికీ మీరు దీపం అయిపోతారు. మీరు కనుక దీపాలు అయిపోతే అంటే మీ హృదయంలో ఉన్న జ్ఞానజ్యోతి కనుక ప్రకాశిస్తే ఇంకా ఎంతో మంది చీకట్లో ఉన్న వాళ్లకి వాళ్ల హృదయంలో ఉన్న వస్తువును వాళ్ళు చూసుకోవటానికి మీరు ఉపయోగపడతారు. కానీ మీరు ఏమి చేస్తున్నారు? జ్ఞానానికి ప్రథమ స్థానం ఇవ్వట్లేదు. జ్ఞానం అప్రధానం అనుకుంటున్నారు. మిగతా విషయాలు అన్నీ ప్రధానం అనుకుంటున్నారు. ఏదో దానం చేయటం, ధర్మం చేయటం, పూజ చేయటం, జపం చేయటం, ఇవన్నీ నేను చెయ్యవద్దు అనటం లేదు మీరు చేసుకోండి. కానీ జ్ఞానం తరువాతే ఇవన్నీ కూడా. మీరు చేసే దానం, మీరు చేసే ధర్మం, లేకపోతే మీరు చేసేటటువంటి నిష్కామ కర్మ, ఏదైనా జ్ఞానం కలగటం కోసమే. జ్ఞానమే ప్రధానం. మీకు జ్ఞానం కలిగితే శాశ్వతంగా ఈశ్వరుడు మిమ్మల్ని సొంతం చేసుకుంటాడు. ఒక్కసారి జ్ఞానం కలిగితే మళ్ళీ మీరు ప్రకృతిలోకి రావక్కర్లేదు, మళ్ళీ శవాలను మొయ్యక్కర్లేదు. మీరు దుఃఖ పడక్కర్లేదు. శాంతి స్థానంలోకి, మోక్ష స్థానంలోకి ఈశ్వరుడు మిమ్మల్ని తీసుకెళ్ళి తన సొంతం చేసేసుకుంటాడు. ఎప్పుడు? మీకు జ్ఞానం కలిగినప్పుడు. ఒక రహస్యం మీరు మనస్సులో పెట్టుకోండి. మీకు పాండిత్యం ఉండవచ్చు, డబ్బు ఉండవచ్చు, గౌరవాలు ఉండవచ్చు, పదవులు ఉండవచ్చు, ఎన్ని ఉన్నప్పటికీ మీరు కష్టపడి జ్ఞానం సంపాదించారా, మీ ద్వారా లోకానికి జరిగే ఉపకారం ఎవరి వల్ల జరగదు. కోట్లాది రూపాయల వల్ల కాని, గొప్ప గొప్ప అధికారాలు సంపాదించడం వల్ల కాని, గొప్ప గొప్ప రచనలు చేయటం వల్ల కాని, గొప్ప గొప్ప ఉపన్యాసాలు చెప్పటం ద్వారా కాని, ఎన్ని మహిమలు చేసినా, బాహ్యమైన పనులు ఎన్ని చేసినప్పటికీ జరగని ఉపకారం మీలో ఒకరు జ్ఞాని అయితే మీలో నుంచి జ్ఞానం, వెలుగు, కాంతి, శాంతి, మీ హృదయం లోంచి బయటకు వచ్చి బాహ్యలోకం అంతా కూడా కమ్మి, లోకం అంతా ప్రసరించి ఎంతో మంది జీవులు అభివృద్ధిలోకి రావటానికి, పరిణామంలో ముందుకు వెళ్లటానికి మీరు ఒక్కరు ఉపయోగపడతారు. మీలో ఒక్కరు జ్ఞాని అయితే చాలు. అది మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు చేసే చిన్న చిన్న ఉపకారాలు స్వల్పమైన ఉపకారాలు అవే మీరు పెద్దవి అనుకుంటున్నారు. మీకు కనుక ఆత్మ దర్శనం అయితే, హృదయంలో ఉన్నటువంటి జ్ఞానం కనుక మీ అనుభవంలోకి వస్తే, ప్రపంచానికి మీ ద్వారా జరిగే మేలు కంటే ఎవరు ఎక్కువ ఏమి చేయలేరు. అనేకమంది రాజకీయ నాయకులు కలిసినా మీ

ద్వారా జరిగే ఉపకారం వాళ్ళ వల్ల కూడా జరగదు. అందుచేతనే కృష్ణుడు భగవద్గీతలో నువ్వు జ్ఞానివికా, యోగివికా, ఋషివికా అని అర్జునుడికి అనేక సార్లు చెప్పాడు. మీరు ఆత్మానుభవం పొందితే మిమ్మల్ని చూసి అనేకమంది జ్ఞానులు అవుతారు, ఈ లోకం యొక్క పోకడనే మార్చేస్తారు. దేనికి ఉంది ఆ శక్తి? ఆత్మకు ఒక్క దానికే ఆ శక్తి ఉంది. మాయకు కూడా శక్తి ఉంది. ఆ శక్తే మనలని ఆడిస్తుంది. జన్మ జన్మలకి ఏ శరీరం వస్తే ఆ శరీరమే నేను అనుకుని, దేహం ఎక్కడ ఉంటే అక్కడే ఉన్నాను అనుకుని దేహం మరణిస్తే నేను మరణించాను అనుకుని, దేహం జన్మిస్తే నేను జన్మించాను అనుకుని, దేహమే నేను అనుకుని, దేహమే ఆత్మ అనుకుని, దేహమే సర్వస్వం అనుకుని ఈ రకంగా మనం జీవించటానికి కారణం మాయా శక్తి. ఈ మాయ లోంచి బయట పడాలి అంటే ఆత్మని దర్శించాలి. ఎవడైతే ఆత్మని దర్శించాడో, తన హృదయంలో ఉన్నటువంటి ఆత్మ వస్తువును ఎవడైతే ప్రత్యక్షంగా గ్రహించాడో, వాడు మాత్రమే మాయ యొక్క వల లోంచి బయట పడగలడు. ఈ వల లోంచి బయటకు రావాలి అంటే అనుగ్రహం అనే వలలో పడాలి. అక్షరమణమాలలో అనుగ్రహం, అనుగ్రహం అనే మాట ఎన్ని సార్లు ఉపయోగించారో స్వామి. అంటే ఆ అనుగ్రహం ఎక్కడ ఉంది? వైకుంఠంలో ఉందా? కైలాసంలో ఉందా? అనుగ్రహం ఎక్కడ ఉంది? మన హృదయంలోనే ఉంది. మనం ఎక్కడో ఉంది అనుకుంటున్నాం. అనుగ్రహం మన హృదయంలోనే ఉంది. వైకుంఠం మన మనస్సు కల్పించింది. కైలాసం మన మనస్సు కల్పించింది. ఈ బాహ్య ప్రపంచం అంతా మన మనస్సు కల్పించింది. అన్నీ మన మనస్సు కల్పించింది. కాని అనుగ్రహం మన హృదయంలోనే ఉంది. అది ప్రత్యక్షంగా ఉంది. బాహ్యంగా తిరుగుతున్న మన మనస్సు ఒక్కసారి లోపలకి తిరిగింది అంటే వెంటనే ఆ అనుగ్రహం మనలని లోపలకి గుంజేసు కుంటుంది. మన లోపల అనుగ్రహం లేదు అనుకుని ఎక్కడో దేవాలయాలలో, గోపురాలలో, యాత్రలలో, నదులలో, ఎక్కడో ఉంది అని మనం తిరుగుతున్నాం. కానీ మనకి దగ్గరగా అనుగ్రహం మన హృదయంలోనే ఉంది. ఈ అనుగ్రహాన్ని ఎవరైతే గుర్తించారో, దాని యొక్క ఉనికిని ఎవరైతే పట్టుకున్నారో, అది వెంటనే మన జీవలక్షణాలని లోపలకి లాక్కుంటుంది. దాని స్పర్శ తగిలేటప్పటికి, జీవలక్షణాలు అన్నీ కరిగిపోతాయి. అందుచేత అనుగ్రహం అనేది ఎక్కడో ఉంది అనుకోకండి, గురువే అనుగ్రహం. ఈశ్వరుడే అనుగ్రహం. ఆత్మే అనుగ్రహం. అది ఎక్కడ ఉంది? మీ హృదయంలో ఉంది. రుద్రస్యసూనుం ఎవరీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి? ఈశ్వరుని యొక్క కుమారుడు. తండ్రీ కుమారుడు ఒక్కటే. I and my father are one అన్నాడు యేసు. నేను నా తండ్రీ ఒక్కటే.

సురసైన్యనాథం అంటే దేవతల యొక్క సైన్యానికి అధిపతి, ప్రభువు. దేవతల యొక్క సైన్యానికి ప్రభువు అయిన కుమారస్వామిని గుహం సదాహం శరణం ప్రపద్యే. నేను ఎల్లపుడూ శరణు వేడుకుంటున్నాను. అని సుబ్రహ్మణ్యస్వామి యొక్క ధ్యాన శ్లోకం.

**షడాననం కుంకుమ రక్తవర్ణం, మహామతిం దివ్య మయూర వాహనం ,**
**రుద్రస్యసూనుంసురసైన్యనాథం, గుహం సదాహం శరణం ప్రపద్యే.**

రమణస్వామి దగ్గరకు ఒక బీదవాడు వచ్చాడు, స్వామి మీ దగ్గరకు పళ్ళు తీసుకు రావటానికి నా దగ్గర ఏమి డబ్బులు లేవు. ఏదైనా ఒక అరటిపండు తీసుకువద్దాం అనుకున్నాను. నా దగ్గర కొనటానికి డబ్బులు లేవు. అందుచేత వట్టి చేతుల తోటి వచ్చాను మీకు ఏమి తేలేదు అన్నాడు. అప్పడు రమణస్వామి "ఏమి తేలేదు అనకు. నేనుని తెచ్చావు కదా" అని అన్నారు. ఏమి తేలేదు అనకు నేను నేను అని మోసుకు తిరుగుతున్నావు ఈ శవాన్ని. ఏవండీ అందరికి ఎవరి శరీరాలు అంటే వాళ్లకి ఇష్టం. ఈ శరీరం ఎవరిది? ఈ నేనుదే. ఈ పుస్తకం ఎవరిది అండి? నాది. ఈ తుండు ఎవరిది? నాది. ఈ శరీరం ఎవరిది? నాది. తల్లి గర్భం నుండి బయటకు వచ్చినప్పటి నుంచి నేను అని అంటున్నారు కదా మీరు, ఈ నేను అని ఎవరు అంటున్నారు. ఒక్కసారి ఆలోచించండి. ఈ దేహం అంటుందా? ఎవరి దేహం అయినా సరే నేను నేను అని అంటుందా? దేహానికే నేను అనే శక్తి ఉంటే, దేహాన్ని దహనం చేయనిస్తుందా అసలు. స్మశానంలోకి ఎవరిని అయినా తీసుకు వెళ్ళగలరా! ఈ దేహం నేను అని అనదు. ఈ దేహంలో ఎవరో ఒకరు ఉన్నారు. వారు అంటున్నారు నేను నేను అని. వారే చెబుతున్నారు దేహం నాది అని.

ఈ నేను నేను అని ఎవరు అంటున్నారు? లోపల ఉన్న మనస్సు అంటుంది. ఈ మనస్సునే జీవుడు అంటారు. ఈ జీవుడే యాత్రలు చేస్తాడు. కైలాసానికి వెళతాడు, వైకుంఠానికి వెళతాడు. స్వర్గానికి వెళతాడు. మళ్ళీ భూమి మీదకు వస్తాడు. ఇలా తిరుగుతూ ఉంటాడు. ఎవరు? ఈ మనస్సు. ఈ మనస్సు గారే ఈ గొడవ అంతా చేస్తున్నారు. దీనికి మంచి పేరు పెట్టారు భగవాన్. ఎవరికి? ఈ మనస్సు గారికి, ఈ మనస్సు గారికి ఏమి పేరు పెట్టారు అంటే చిత్ జఢ గ్రంధి. అంటే ఏమిటి అది కేవలం నూటికి నూరు పాళ్ళు ఆత్మకి సంబంధించినది కాదు, ఈ శరీరానికి సంబంధించినది కాదు ఈ మనస్సు. అది లోపల ఉన్న ఆత్మని, ఈ శరీరాన్ని, ముడి వేస్తుంది. ఆ ముడే మనస్సు. ఆ ముడి ఎవరికి అయితే తెగిపోయిందో వాడికి ఇంక పునర్జన్మ లేదు. వాడు ఈ భూమి మీదకు రావక్కర్లేదు.

చిత్ జడ గ్రంథి. గ్రంథి అంటే ముడి. మన మనస్సే ముడి. ఆ మనస్సే నేను నేను అని అంటుంది. ఈ మనస్సుకే శరీరం కావాలి ఆత్మకి శరీరం అక్కర్లేదు. జ్ఞానికి శరీరం అక్కర్లేదు. ఏమీ అక్కర్లేదు. శవానికి కామం లేదు. శవానికి కోపం లేదు. శవానికి ద్వేషం లేదు. శవానికి అసూయ లేదు. ఈ శవంతో పాటు నేను కూడా కలవాలి. అప్పుడు మీకు కామం వస్తుంది. ద్వేషం వస్తుంది. అసూయ వస్తుంది. అన్నీ వస్తాయి. ఇవి రెండు కలిస్తేనే సంసారం. ఏ రెండు కలిస్తే అండి? ఈ దేహం, ఈ నేను కలవాలి. ఇవి రెండు లేకపోతే జాగ్రదావస్థ లేదు అసలు. ఇవి రెండు ఉండాలి. ఇవి రెండు ఉంటేనే నష్టం వచ్చినా, లాభం వచ్చినా, మరి ఇంకో పదవులు సంపాదించినా, గౌరవాలు అయినా, గొప్పలు అయినా, ఇంకోటి అయినా, ఇంకోటి అయినా ఇవి రెండు ఉంటేనే ఈ దేహం ఒకటి, ఈ నేను అనేవాడు ఒకడు

ఉండాలి. ఆ నేను, ఈ దేహం కలిస్తేనే లోకం యొక్క నడక. ఇదే మాయ. ఈ మాయ ఎక్కడ ఉంది? మనస్సులోనే ఉంది మాయ. అంటే ఈ దేహాన్ని కల్పించింది ఎవరు? మనస్సే. లోకాన్ని కల్పించింది ఎవరు? మనస్సే. నేను నేను అంటే ఎవరు? ఈ మనస్సే. అంటే నేను ఎవరు అనే ప్రశ్న, నీ మనస్సుకి అంకుశం లాంటిది. ఈ నేను ఎవరు అని ఎక్కువగా చెబుతారు ఏమిటి అని మీరు అనుకోవచ్చు. ఇక్కడొక చిన్న రహస్యం చూడండి. మీరు పూజ చేస్తే తాత్కాలికంగా మీ యొక్క బాధని మర్చిపోతారు. ఏ పురాణం అయినా వింటున్నారు అనుకోండి, మీ కష్టాన్ని కాసేపు మర్చిపోతారు. మీకు ఏదైనా ఇంట్లో బాధగా ఉంది అనుకోండి కొంతమంది ఏమి చేస్తారు. సినిమాకు వెళ్లి వస్తాం అంటారు. సినిమాకు వెళ్లి వస్తే ఆ పాటలు, ఆ బొమ్మలు, ఆ ఆటలు వలన మీ మనస్సు కొంచెం diversion అవుతుంది. ఏవండీ మళ్ళీ ఇంటికి వచ్చిన తరువాత గొడవ, అల్లరి మామూలే. అలా పూజ చేసినప్పుడు మీకు ఏమి అవుతుంది? ఆ దేవుడి రూపం మీరు స్మరించుకుని మీ మనస్సు కొంచెం ఆ దేవుడి మీద నిలబడి బాగుంది బాగుంది అనిపిస్తుంది. మీ కష్టాన్నో, మీ బాధనో, ఒక పది



**పని బంధించదు, దానిమీద ఆసక్తి బంధిస్తుంది. ఆసక్తి లేకుండా పని చేస్తే నీకు కర్మ చుట్టుకోదు. ఆసక్తి లేకుండా పని చేస్తే పాత వాసనలు ఊడిపోతాయి, కొత్త వాసనలు రావు. మనం ఏ పని చేసినా జ్ఞానం కోసమే చెయ్యాలి.**

నిమిషాలో, ఇరవై నిమిషాలో ఆ పూజ చేసినంతసేపు మీరు మర్చిపోతున్నారు. మంచిదే పూజ చేయండి. మీరు నామం చేస్తున్నారు అనుకోండి రామ నామమో, కృష్ణ నామమో, శివ నామమో, ఏదో ఒకటి చేస్తున్నారు. మంచిదే. నామం ఎవరు చేస్తారు? మీ మనస్సు చేస్తుంది. ఆ మనస్సు నామం చేసినంతసేపు శాంతిగా ఉంటుంది, సుఖంగా ఉంటుంది, కుదురుగా ఉంటుంది. మీరు ఆ నామం వదిలేశారు అనుకోండి మళ్ళీ మీ తలకాయ పోటు మీదే. నేను అనే సమస్యను శాశ్వతంగా మీరు పరిష్కరించుకోవాలి. సోదరమహాశయులారా! ఇది మీరు బాగా ఆలోచించండి. మీరు పూజ చేసుకోండి, జపం చేసుకోండి, ధ్యానం చేసుకోండి, ఇవన్నీ తాత్కాలికం. మనస్సు అనే సమస్యని సమగ్రంగా శేషం లేకుండా దానిని పరిష్కరించలేకపోతే మనం ఈ జనన మరణ చక్రం లోంచి, ఈ ప్రకృతి లోంచి, ఈ దుఃఖం లోంచి బయట పడలేము. మీరు పూజ చేయండి కొంతకాలం మీకు దుఃఖం తగ్గవచ్చు. మీరు జపం చేయండి కొంతకాలం మీకు దుఃఖం తగ్గవచ్చు. మీరు ధ్యానం చేయండి ఒక పది నిముషాలు దుఃఖం తగ్గవచ్చు. మీరు యాత్రలకు వెళ్ళి రండి ఒక పది రోజులు మీకు దుఃఖం తగ్గవచ్చు. మీ మనస్సు యొక్క మూలం మీకు తెలిస్తేనే కాని, ఈ నేను యొక్క స్వరూపం మీకు తెలిస్తేనే కాని శాశ్వతంగా మీరు దుఃఖం నుండి బయట పడలేరు. మీరు ఎవరు, మీరు ఎవరు అని అడిగినప్పుడు మీ కులం ఏమిటి అని కాని, మీ మతం ఏమిటి అని కాని, మీ దేశం ఏమిటి అని కాని, మీ జాతి ఏమిటి అని కాని సమస్య కానే కాదు. మీరు నేను నేను అని అంటున్నారు. ఆ నేను ఎవరు అని ప్రశ్నిస్తున్నారు భగవాన్. ఆ నేను, నేను అని చెప్పే ఆ నేను ఎవరు అని, ఆ నేను మనల్ని దట్టంగా పట్టేసింది. రంగన్ ఏమి చెబుతున్నాడు అంటే భగవాన్ నీ గురించి ఎవరికి తెలుస్తుంది? నన్ను ఈ నేను పట్టుకు ఆడిస్తోంది. ఈ నేను యొక్క పట్టులో నేను ఉన్నప్పుడు, ఈ అహంకారం యొక్క గుప్పిట్లో నేను ఉన్నప్పడు రమణ నువ్వు ఎంతటి వాడివి అయినా, నువ్వు ఎవరివో నాకు తెలుస్తుందా? అంటున్నాడు. భయం ఎవరికి? నేనుకే. ఆ నేను ఉంది కాబట్టి భయం వేస్తుంది. ఆ నేనుని తీసేస్తే భయం లేదు. అంటే నేను అంటే ఎవరు? అది మొదటి తలంపు. ఆ తలంపుకి ఇతర తలంపులు వస్తున్నాయి. భయం అనేది ఒక తలంపు. కామం అనేది ఒక తలంపు, ద్వేషం అనేది ఒక తలంపు. మీకు తలంపు లేకుండా ఎవరిని అయినా ద్వేషించగలరా మీరు? తలంపు లేకుండా మీకు ఎవరికి అయినా కామం వచ్చిందా? తలంపు లేకుండా ఎవరికి అయినా కోరిక వచ్చిందా? తలంపు లేకుండా ఎవరికి అయినా భయం వచ్చిందా? ఏమి రాలేదు. అన్నీ తలంపులే.

అయితే ఈ నేను అనే మొదటి తలంపుకి ఈ తలంపులు అన్నీ వస్తున్నాయి. భగవద్గీతలో కృష్ణుడు మనకు ఒక్క అబద్ధం కూడా చెప్పలేదు. ఆయన మన దగ్గర ఏమి ఆశించలేదు కాబట్టి మనకు అబద్ధం చెప్పవలసిన పనే లేదు ఆయనకు. మన దగ్గర ఏదైనా ఆశించాడు అనుకోండి వాడు ఎంతటి వాడు అయినా అబద్ధం చెబుతాడు. జీవితం అంతా ప్రయత్నం చేసి భగవద్గీతలో ఒక్క మాట జీర్ణం చేసుకోండి, ఆ మాటలు మనకు జీర్ణం అవ్వక అసలు ఆ మాటలే అబద్ధం అనుకుంటున్నాం. కృష్ణస్వామి చెప్పిన మాటలు అబద్ధం అనుకుంటున్నాం, రమణస్వామి చెప్పిన మాటలు అబద్ధం అనుకుంటున్నాం, కారణం ఏమిటి? అవి మనకి జీర్ణం కావట్లేదు. అరుణాచలం కొండ మీద ఒక మర్రి చెట్టు కింద ఇప్పుడు ఇక్కడ మనం ఎలా కూర్చున్నామో, అలా రక్త మాంసాల తోటే అరుణాచలేశ్వరుడు సిద్ధ రూపంలో ఈనాటికి కూర్చొని ఉన్నాడు అన్నారు భగవాన్. అరుణాచలేశ్వరుడు ఒక మర్రి చెట్టు కింద సిద్ధ రూపంలో కూర్చొని ఉన్నాడు. అరుణాచలంలో ఈశ్వరుడు ఎన్ని రూపాలలో ఉన్నాడు? మూడు రూపాలలో ఉన్నాడు. ఒకటి లింగరూపం, రెండు కొండ రూపం, మూడు సిద్ధరూపం.

భగవంతుడికి మనం అందరం ఇష్టులం అవ్వాలి. ఎలా చేస్తే ఇష్టులం అవుతాం? పూజ చేస్తే ఇష్టులం అయిపోతామా? జపం చేస్తే ఇష్టులం అయిపోతామా? నామం చేస్తే ఇష్టులం అయిపోతామా? చేస్తే చేయండి మీరు చెయ్యవద్దు అని నేను అనటం లేదు, చేయండి ఎలా ఇష్టులం అవుతాం? అదే పరమేశ్వరుడు చెబుతున్నాడు అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ ఏ భూతముల పట్ల మనకు ద్వేషం ఉండ కూడదు. మీ హృదయంలో వెతుక్కోండి ఎవరి మీద అయినా మీకు ద్వేషం ఉందేమో అని, మైత్రః సమస్త సృష్టి తోటి నువ్వు స్నేహంగా ఉండాలి. ప్రతీ వ్యక్తి తోటి నువ్వు స్నేహంగా ఉండవలసిందే. విరోధభావం పనికి రాదు. కరుణ ఏవచ, కరుణ కలిగి ఉండాలి. కర్మ చేసిన వాడి కంటే కరుణ కలవాడి యొక్క కీర్తి ప్రపంచం అంతా కూడా వ్యాపిస్తుంది. కర్మ కంటే కరుణ గొప్పది. ఎవరి హృదయంలో అయితే కరుణ ఉందో ఆ కరుణా స్వరూపుడు మాములుగా బాహ్యంగా అనేక సత్కర్మలు చేసిన వాడి కంటే వీడి యొక్క కీర్తి ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. వీడిని తొందరగా ఈశ్వరుడు తనలో ఐక్యం చేసుకుంటాడు. మీరు బాహ్యంగా చాలా గొప్ప పనులు చెయ్యండి. అంతకంటే మీ హృదయంలో దయ కనుక ఉంటే, పరమేశ్వరుడు మీకు వ్యక్తం అవుతాడు. అంతేకాదు మీ కీర్తి ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. అయితే మనకి కూడా దయ ఉంటుంది. కాని ప్రతిఫలం ఆశిస్తుంది. అహంకారం అహంకారం అంటే ఏమిటి? ఈ రోగం ఎక్కడుంది? కారంలో ఉంది. ఈ కారమే ప్రతీ మనిషిని

పట్టుకుని ఆడిస్తుంది. దెయ్యాలు భూతాలు మనుషులని పట్టుకుని ఫూనుతూ ఉంటాయి. అలా ప్రతీ వాడిని ఈ కారం ఏమి చేస్తుంది అంటే దెయ్యం కింద పట్టుకుని ప్రతీ వాడిని ఊరేగిస్తుంది. అహానికి దేహానికి ఎట్టి సంబంధం లేదు. ఎక్కడైతే నేను అనే తలంపు లేదో, ఎక్కడ భయం లేదో, ఎక్కడ రాగం లేదో, ఎక్కడ ద్వేషం లేదో, ఎక్కడ ద్వంద్వాలు లేవో, ఎక్కడ ద్వైత బుద్ధి లేదో అక్కడకు నన్ను మేలుకొలుపు తండ్రీ అని గీతాంజలి లో ఠాగూర్ అన్నాడు. ఈ నేను అనే తలంపు ఎక్కడ లేదో అక్కడ స్వరూపం ఉంది అన్నారు రమణస్వామి. అహం నేను అనే తలంపుకి ఈ దేహానికి కొంచెం కూడా సంబంధం లేదు. కొంచెం కూడా సంబంధం లేదు కాబట్టే ఈ దేహం కాల్చి బూడిద చేస్తే, దేహం కప్పెట్టి మన్ను చేస్తే ఆత్మ ఏమి నశించదు. ఆత్మకి దేహానికి ఏమి సంబంధం లేదు. ఆ ఆత్మే అహం. కృష్ణుడు కూడా నేను అన్నాడు. మనం కూడా నేను అంటున్నాం. కృష్ణుడు చెప్పే నేనులో కారం లేదు. మనం చెప్పే నేనులో కారం ఉంది. ఈ కారం ఎక్కడో ఉంది అనుకుంటున్నాం. అది దేహం ఎక్కడ కూర్చుంటుందో అక్కడ కూర్చుంటుంది. దేహం నిద్రపోయినప్పుడు నిద్రపోతుంది. దేహం చనిపోయినప్పుడు ఏడుస్తుంది. పుట్టినప్పుడు సంతోషిస్తుంది. ఎవరైనా పొగిడితే ఏనుగు ఎక్కి కూర్చుంటుంది. ఎవరైనా తిడితే కింద పడిపోతుంది. ఏది? కారం. ఈ కారం ఎప్పుడూ దేహాన్ని పట్టుకుని ఉంటుంది. మీరు ఎంతో కాలం బ్రతకరు అని డాక్టరు గారు అంటారు అనుకోండి వెంటనే ఏడుస్తుంది, ఎవరు? దేహం కాదు ఈ కారం ఏడుస్తుంది. ఈ శరీరానికి రోగం వచ్చింది అనుకోండి, శరీరం వచ్చిన తరువాత రోగం వస్తుంది. శరీరం రాకుండా రోగం ఉంటుందా? దేహానికి కాకపోతే రోగాలు దేనికి వస్తాయి? ఈ కారానికి మటుకు రోగం లేదు. ఈ కారానికి రోగం లేదు కాని ఏడుస్తుంది కారం. దేహానికి వచ్చిన రోగాన్ని చూసి కారం ఏడుస్తుంది. దేహానికి రోగం వస్తే కారం ఏడవటం ఏమిటి దేహాన్ని పట్టుకుని అది ఉంటుంది. అందుచేత ఈ కారం ఎంతకాలం మనలో పాతుకుని ఉంటుందో, ఈ కారం ఉన్నంత సేపు జన్మలు తప్పవు. ఈ కారం ఉన్నంతకాలం దుఃఖం తప్పదు. ఈ కారం ఉన్నంతకాలం కష్టాలు తప్పవు. నష్టాలు తప్పవు, బాధలు తప్పవు, భారాలు తప్పవు. బాధ్యతలు తప్పవు, ఏదీ తప్పదు ఈ కారం ఉన్నంతకాలం, అందుకే అహంకారం ఉంటే అంతా ఉంది అది లేకపోతే ఏది లేదు అన్నారు రమణస్వామి, ఈ కారం ఉంటే అంతా ఉంది అట. నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, అత్త ఉంది, కోడలు ఉంది మామగారు ఉన్నారు, లోకం ఉంది, ప్రకృతి ఉంది, పంచభూతాలు ఉన్నాయి, సూర్యుడు ఉన్నాడు, చంద్రుడు ఉన్నాడు. మంచి ఉంది, చెడు ఉంది, స్వర్గం ఉంది, నరకం ఉంది,

వైకుంఠం ఉంది, భూమి ఉంది అన్నీ ఉన్నాయి. మీ దేవుళ్ళు ఉన్నారు, మీ పూజలు ఉన్నాయి, మీ జపాలు ఉన్నాయి, మీ వ్రతాలు ఉన్నాయి, మీ లోకాలు ఉన్నాయి, అన్నీ ఉన్నాయి ఎప్పుడు? ఈ కారం ఉన్నంతకాలం, కారం లేకపోతే ఏదీ లేదు.

మీరు నన్ను పొగుడుతుంటే నాకు సంతోషం వచ్చేస్తుంది, అలాగే రాముడి పటం ఎదురుగా పెట్టుకుని రామా నువ్వు చాలా గొప్పవాడు అని చెబుతారు అనుకోండి అలా నాకు సంతోషం వచ్చేసినట్టు రాముడికి కూడా సంతోషం వచ్చేస్తే వాడు దేవుడు ఎలా అవుతాడు? అయితే ఈ స్తోత్రాలు ఎందుకు? ఇది అంతా ఎందుకు అంటే మన మనస్సు బాగు పడటం కోసం స్తోత్రాలు కాని. మీ స్తోత్రానికి దేవుడు సంతోషిస్తాడా? వాడికి కారం ఉందా అక్కడ? మీరు బాగు పడటం కోసం, మీ అభివృద్ధి కోసం, మీ మనస్సు వికసించటం కోసం. మీ హృదయం యొక్క లోతుల్లోకి మీరు దిగడం కోసం, పరమేశ్వరుడి యొక్క స్తోత్రాలు పెట్టారు కాని పరమేశ్వరుడు అక్కడ గర్వ పడడు మీ స్తోత్రాలు చూసి, గర్వ పడితే వాడికి కారం ఉన్నట్టే, గర్వ పడితే వాడు దేవుడు ఎలా అవుతాడు జీవుడే. God looks into your heart, నువ్వు చెప్పే మాటలు కాదు, నువ్వు కదిపే పెదాలు కాదు చూసేది భగవంతుడు. నీ కళ్లను కాదు చూసేది భగవంతుడు, నీ హృదయంలోకి చూస్తూ ఉంటాడు. God looks into your heart నువ్వు ఒక మాట అంటే ఏ ప్రేరణ వల్ల ఆ మాట చెప్పావు? నువ్వు ఒక చూపు చూస్తే ఏ ప్రేరణ వల్ల ఆ చూపు చూశావు? నీ లోపల తలంపు చూసుకుంటాడు. అది భగవంతుడు చేసే పని అంతేకాని నీ మాటలకి, నీ గుంజీలకి, దేవుడు మోసపోడు. మీరొక మాట మాట్లాడొచ్చు, నన్ను మోసం చేయొచ్చు. మీరు మాట్లాడేటప్పుడు లోపల ఉన్న తలంపుని ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు కాబట్టి ఈశ్వరుని మీరు మోసం చేయలేరు. మీరు నన్ను మోసం చేయొచ్చు, నేను మిమ్మల్ని మోసం చేయొచ్చు కాని మనం అందరం కలిసి ఈశ్వరుని మోసం చేయలేము. దేవుడికి స్తోత్రాలు చేస్తున్నాం అంటే మీ బాగు కోసమే మీరు స్తోత్రాలు చేస్తున్నారు కానీ దానికి దేవుడికి గర్వం వచ్చేసి నన్ను వీళ్ళు అందరూ పొగిడేస్తున్నారు అని అలా సంతోషించడు. అలా సంతోషిస్తే వాడు దేవుడే కాదు. ఇది అంతా ఎవరి కోసం? నీ యొక్క అభివృద్ధి కోసం, నీ ఆధ్యాత్మిక వికాసం కోసమే మన పూర్వీకులు ఈ స్తోత్రాలు పెట్టారు కాని దేవుడి కోసం కాదు. స్తోత్రం చేయటం మంచిదే, రాముడిలో ఉన్న గుణాలు, కృష్ణుడిలో ఉన్న గుణాలు, రమణస్వామిలో ఉన్న గుణాలు, రామకృష్ణుడిలో ఉన్న గుణాలు, మంచి మంచి గుణాలు మీరు అలవర్చుకోండి. మంచి మంచి great qualities ఇవన్నీ మీరు అలవర్చుకోండి. బంగారపు వస్తువుల తోటి మీరు ఎలా అలంకరించుకుంటున్నారో, అలా

మంచి మంచి గుణాలని, రాముడికి ఉన్న గుణాలని అటువంటి గుణాలని అలవర్చుకోండి. అయితే గుణాలు ఎక్కడ నుంచి వస్తాయి? పంచదార ఎక్కడ నుంచి వస్తుంది? పంచదార ఫ్యాక్టరీ లోంచి పంచదార వస్తుంది. సిమెంట్ ఎక్కడ నుంచి వస్తుంది? సిమెంట్ ఫ్యాక్టరీ నుండి వస్తుంది. అన్నీ తలొక చోటు నుండి వస్తున్నాయి. మరి ఈ గుణాలు ఎక్కడ నుంచి వస్తాయి? ఈ క్యారెక్టర్ ఎక్కడ నుంచి వస్తుంది? ఎవడైతే తన అహంకారాన్ని నియంత్రించుకుంటున్నాడో, ఎవడైతే తన అహంకారాన్ని కంట్రోల్ చేసుకుంటున్నాడో, ఎవడైతే తన అహంకారాన్ని స్వాధీనం చేసుకుంటున్నాడో, వాడిలోని సద్గుణాలు అన్నీ, గొప్ప గుణాలు అన్నీ, కళ్యాణ గుణాలు అన్నీ, హృదయంలోకి వచ్చి వరిస్తాయి. మీ అహంకారాన్ని కనుక మీరు కంట్రోల్ చేసుకుంటే, మీ మనస్సుని కనుక మీరు నియమించుకుంటే, మీరు మాట్లాడే మాటలను కనుక మీరు నియమించుకుంటే, మీ ఇంద్రియాలను కనుక మీరు నియమించుకుంటే, గొప్ప గొప్ప గుణాల కోసం మీరు ఎక్కడికో వెళ్లనక్కరలేదు. మీ మనస్సుని నియమించుకోవడం ద్వారా మీ హృదయంలోనే గొప్ప గొప్ప గుణాలు ఉత్పత్తి అయ్యి, అనంతమైన కళ్యాణ గుణాలు మీ హృదయం నుండి వచ్చి మిమ్మల్ని చుట్టుకుంటాయి, మిమ్మల్ని వరిస్తాయి. మిమ్మల్ని అందలం ఎక్కిస్తాయి. మంచి గుణాలు ఎందుకు కావాలి? మంచి గుణాలు ఉంటే మీ మనస్సు పలుచబడుతుంది. మీ మనస్సు సున్నితం అవుతుంది. మీ మనస్సు ఆత్మ వైపుకి పరుగు పెడుతుంది. డాక్టరు ఏమి చేస్తాడు అంటే మందు ఇచ్చి పత్యం కూడా చెబుతాడు. ఊరగాయ తినకండి, మాగాయ తినకండి, దుంప కూరలు తినకండి అని ఏవో పత్యం చెబుతాడు. అదే విధంగా మీ సాధనతో పాటు మీకు మంచి గుణాలు కనుక ఉంటే మీ మనస్సు ఆత్మ వైపుకి వడిగా, వేగంగా ప్రయాణం చేసి ఆత్మాకారం చెందుతుంది అది మీ కడసారి జన్మ. మనస్సు అంతర్ముఖం అవ్వటానికి మంచి గుణాలు కావాలి, అయితే మంచి గుణాలే మన గమ్యం కాదు. సోదరమహాశయులారా ఒకటి మటుకు మీరు జ్ఞాపకం ఉంచుకోండి, మీరు ఏ దేవుడిని ఆరాధించండి, మీరు ఏ మతస్తులు అవ్వండి. మీరు ఏ కులస్తులు అవ్వండి. అది కాదు ఇక్కడ ప్రధానం. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పండి. ఈ ప్రశ్నని మరొకసారి మీ మనస్సులో తిప్పకోండి. ఏమిటి ఈ ప్రశ్న? మీరు జపాలు చేస్తున్నారు, దండలు లెక్క పెడుతున్నారు, యాత్రలకి వెళ్లి వస్తున్నారు. అన్నీ రైటే, మీరు ఏమి చేసినప్పటికీ, ఏ పుణ్య కార్యం చేసినప్పటికీ, ఏ ఘన కార్యం చేసినప్పటికీ, మీ మనస్సు ఎక్కడ ఉంది? మీ మనస్సుకి గమ్యం ఏమిటి? మీ మనస్సు కోరేది ఏమిటి? దేన్నీ కోరి మీరు పూజ చేస్తున్నారు? దేన్నీ కోరి మీరు ధ్యానం చేస్తున్నారు? దేన్నీ కోరి మీరు

సత్సంగం చేస్తున్నారు? దేన్నీ కోరి మీరు వ్రతాలు చేస్తున్నారు? ఆ మనస్సు యొక్క లక్ష్యం నాకు చెప్పండి. మీ గమ్యం ఆత్మ అయితే మీకు అందరికి రాకపోతే అపుడు అడగండి. మీలో ఎవరైనా చెప్పండి మీ మనస్సు ఎక్కడ ఉందో, మీరు పూజలు, జపాలు చేస్తున్నారు నేను కాదు అనటం లేదు, నేనే కాదు, ఎవరు కాదు అనలేరు. ఈశ్వరుడు కూడా కాదు అనలేడు. నా కళ్ల తోటి మీరు పూజలు చేయటం నేను చూస్తున్నాను. మీరు చేసే జపాలు నేను చూస్తున్నాను. మీరు చేసే దానాలు నేను చూస్తున్నాను, ఇవన్నీ కళ్లతోటి చూస్తుంటే ఎలా కాదు అంటాను? నేను బుద్ధి లేని వాడినా? అది కాదు నేను అడిగేది, అది చేసేటపుడు మీ మనస్సు ఎక్కడ ఉంటోంది? అది నా ప్రథమ ప్రశ్న, ప్రధాన ప్రశ్న, చివరి ప్రశ్న, మీ మనస్సు ఎప్పుడైనా ఆత్మ వైపు నిలబడుతోందా? ఆత్మని కనీసం కోరుతున్నారా మీరు? ఆత్మని మీరు పొందలేక పోవచ్చు. ఆత్మే నాకు కావాలి, భగవంతుడి స్వరూపమే నాకు కావాలి అని కనీసం మీ మనస్సు కోరుతోందా? మీరు ఆత్మను కోరే పూజలు చేస్తున్నారా? ఆత్మను కోరే జపాలు చేస్తున్నారా? ఆత్మను కోరకపోతే మీరు దేనిని ఉద్దేశించి పూజలు చేస్తున్నారు? మీరు ఎక్కడకు వెళతారు? అసలు మీ గమ్యం ఏమిటో నిర్ణయించుకోండి. మీరు పొందవలసినది ఏదో నిర్ణయించు కోండి. మీరు అడుగులో అడుగు, అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా నడిచి వెళ్లండి. వెళ్లే రోడ్డు సరైనది అయితే, మార్గం కరెక్టు అయితే తప్పనిసరిగా మీకు మోక్షం వస్తుంది. ఆ రోడ్డు కనుక కరెక్టు కాకపోతే, మీ గమ్యం కనుక కరెక్టు కాకపోతే, మీరు విమానం మీద వెళ్లినా తప్పు చోటుకే వెళతారు. సృష్టి చక్రంలో పడిపోయి ఈ జీవులు అందరూ తిరుగుతున్నారు. వాళ్ల హృదయంలో ఉండి వాళ్లని చక్రం తిప్పినట్టు తిప్పుతున్నాను అని పరమేశ్వరుడు భగవద్గీతలో చెప్పాడు. దీని నుండి ఎవరు రక్షించబడతాడు? ఈ చక్రం లోంచి ఎవడు బయట పడతాడు?

**మీకు హితవు అయిన ఆహారం కూడా మితంగా తినండి. అది శుచిగా ఉండాలని భగవంతుడు చెబుతున్నాడు. అటువంటి ఆహారం మనస్సు బాగుపడటానికి సహకరిస్తుంది. అంటే, ఆహార శుద్ధిలోనుండి మనస్సుకి శుద్ధి వస్తుంది. పవిత్రమైన మనస్సు మాత్రమే, సత్యాన్వేషణకు సహకరిస్తుంది.**



ఎవడైతే పూర్తిగా తన మనస్సుని నాకు అర్పించి పని చేస్తాడో, ఎవడైతే తన హృదయంలో కల్మషం లేకుండా తోటి వాడిని ప్రేమిస్తాడో, ఏకాగ్రం అయిన మనస్సు తోటి, పవిత్రం అయిన మనస్సు తోటి, నన్ను హృదయ పూర్వకంగా నమ్మి, నన్నే గమ్యంగా పెట్టుకుని, నన్నే లక్ష్యంగా పెట్టుకుని ఎవడైతే పని చేస్తున్నాడో తప్పనిసరిగా వాడు నా స్వరూపం పొందుతాడు, వాడు ఈ చక్రం నుండి బయటకు వచ్చేస్తాడు. అందుచేత మీరు చెయ్యండి, మీరు చెయ్యవద్దు అనటం లేదు మీ గమ్యం ఏమిటో ముందు మీరు నిర్ణయించుకోండి.

సోదరమహాశయులారా మీరు అందరూ బాగుపడాలి. మీరు ఏ మతంలో ఉన్నారు, ఏ దేవుడిని ఆరాధిస్తున్నారు, మీ గురువు ఎవరు ఇదంతా నాకు ఎందుకు, మీరు బాగు పడటం కావాలి లేకపోతే ఎందుకు ఈ సమావేశాలు? మీరు suffering లోంచి బయట పడాలి, ప్రకృతి లోంచి బయట పడాలి. దుఃఖం నుండి బయటపడాలి. దుఃఖం మీ ఇంట్లో ఉండకూడదు, మీ వొంట్లో ఉండకూడదు. దుఃఖానికి దూరం అయిపోవాలి మీరు, ఆనందానికి దగ్గర అవ్వాలి. అటువంటి ఆనందస్థితిని, శాంతిస్థితిని, శాశ్వతస్థితిని మీరు సంపాదించాలి. అదే ఈ ప్రసంగాల యొక్క ఉద్దేశం కాని లేకపోతే ఈ ప్రసంగాల యొక్క ప్రయోజనం ఏమిటి? ప్రతీ మనిషి ఏ పని చేసినా సుఖం కోసమే, డబ్బు సంపాదించినా సుఖం కోసమే, అధికారంలోకి వెళ్ళినా సుఖం కోసమే, గౌరవాలకి వెళ్ళినా సుఖం కోసమే, చదువుకున్నా సుఖం కోసమే, పాండిత్యం సంపాదించినా సుఖం కోసమే, ప్రతీ మానవుడు సుఖాన్ని దృష్టిలో పెట్టుకుని పని చేస్తాడు. ప్రతీ మనిషికి సుఖం అంటే ఎక్కువ ఇష్టం. ప్రతీ మనిషి సుఖం కోసమే పని చేస్తున్నాడు. మేడలు కట్టుకుంటున్నాం అంటే సుఖం కోసం. ఎయిర్ కండిషన్ గదులు కావాలి అంటే సుఖం కోసం, కారుల మీద తిరుగుతున్నాం అంటే సుఖం కోసం, మానవుడికి అత్యంతమైన ప్రీతి ఏది అంటే సుఖం కావాలి. నాకు సుఖం అక్కర్లేదు అని చెప్పిన మనిషి మీకు లోకంలో ఎక్కడ అయినా కనిపించాడా? సుఖం అన్ని మతాల వాళ్లకి, అన్ని కులాల వాళ్ళకు కావాలి. ఆడవాళ్ళకి కావాలి, మగవాళ్ళకి కావాలి, మనం ఎందుకు కోరుతున్నాం సుఖాన్ని? ఆ సుఖం అనేది ఎలా ఉంటుందో ఒకసారి మనం అనుభవించాం. ఇప్పుడు ఆ సుఖం మనకి దూరం అయిపోయింది, మళ్ళీ మనం ఇప్పుడు ఆ సుఖం కోసం ప్రయాణం చేస్తున్నాం, ఆ సుఖం ఎక్కడ ఉంది? లోకంలో లేదు. ఎక్కడ ఉంది? సత్యంలో ఉంది, ఆత్మలో ఉంది. నాకు సుఖం కావాలి నాకు సుఖం కావాలి అని చెప్పటం అంటే నువ్వు ఆత్మనే వెతుక్కుంటున్నావు. అది నీకు తెలియకుండా నువ్వు ఆత్మని వెతుక్కుంటున్నావు. ప్రతీ మనిషికి సుఖం కావాలి.

సుఖం లేకపోతే మనం ఉండలేము. ఆ సుఖం కోసం వెతుక్కుంటున్నాము అది ఎక్కడ ఉందో తెలియటం లేదు. ఆత్మకి సుఖం వేరుగా లేదు, ఎవడైతే ఆత్మ స్వరూపాన్ని తెలుసుకున్నాడో వాడిని completeగా దుఃఖం విడిచి పెట్టేస్తుంది. వాడికి దుఃఖం తోటి ఉన్న సంబంధం తెగిపోతుంది. అంటే భక్తి యోగం అయినా, జ్ఞాన యోగం అయినా, కర్మ యోగం అయినా, ధ్యాన యోగం అయినా, ఏ యోగం అయినా నీకు దుఃఖం తోటి ఉన్న సంబంధం తెంపేసేదే యోగం. నీకు దుఃఖం తోటి ఉన్న సంబంధాన్ని తెంప లేకపోతే వాడు దేవుడే కాదు. వాడు గురువే కాదు, అది యోగమే కాదు. ఆయనకు సంప్రదాయం లేదని భగవాన్‌ని కొంతమంది విమర్శిస్తారు, దేనికి సంప్రదాయం? మీరు సంప్రదాయాలకు కట్టుబడి ఉండిపోతే మీకు ఆత్మ తెలియదు. మీకు సంప్రదాయం ఉండ వచ్చు కానీ అంత మాత్రం చేతే, ఆ సంప్రదాయమే లక్ష్యం అనుకుని, ఆ సంప్రదాయమే మోక్షం అనుకుని, ఆ సంప్రదాయమే వైకుంఠం అనుకుని, సంప్రదాయం అనే జైలులో పడిపోతే మీకు విడుదల లేదు. మా తాతగారు చాలా గొప్ప వారు, మాది గొప్ప సంప్రదాయం అని కొంతమంది గొప్పలు చెప్పకుంటారు. ఇదంతా అహంకారం పెంచుకోవటానికే. మీ ముత్తాత గొప్ప వారు అయితే, మీ తాతగారు గొప్ప వారు అయితే మీ మాట ఏమిటి? అదే రమణస్వామి అడిగేది. కట్టుబాట్లు ఉండవచ్చు. కట్టుబాట్లు ఉండొద్దు అని భగవాన్ చెప్పటం లేదు. అదే సర్వస్వం, అదే మీ గమ్యం అనుకోకండి. ఈ గౌరవాలు మిమ్మల్ని పరిపూర్ణస్థితికి తీసుకు పోతాయి అని మీరు అనుకోవద్దు. ఈ గౌరవాలు, ఈ అగౌరవాలు, ఈ పుణ్యాలు, ఈ పాపాలు, ఇవన్నీ మనస్సుకి సంబంధించినవి. ప్రకృతికి సంబంధించినవి. ఈ ద్వైతాలు అనేవి ఎక్కడ లేవో అక్కడే స్వరూపం ఉంది. ఆ స్వరూపమే ఈశ్వరుడు, ఆ స్వరూపమే గురువు, ఆ స్వరూపమే ఆత్మ, ఆ స్వరూపమే అంతటా ఉంది. నువ్వు దేహానివి అనుకున్నప్పుడు నువ్వు మరణిస్తున్నావు. దేహాన్ని అనుకున్నప్పుడే నేను పుట్టాను అనే భావన వస్తుంది. దేహాన్ని అనుకొన్నప్పుడే ఫలానా పంజావేమవరంలో ఉన్నాను అనుకుంటున్నావు, ఆత్మ అనుకున్నప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నావు? అది లేని చోటు లేదు. ఓ రమణస్వామి నిన్ను కనిపెట్టుకుని ఉన్నాం, మా దేశాలను విడిచి పెట్టి ఇక్కడకు వచ్చాం, ఇప్పుడు మమ్మల్ని విడిచి పెట్టి నువ్వు వెళ్ళిపోతున్నావు అంటే అప్పడు భగవాన్ అన్నారు I am not going away, I am here నేను ఎక్కడికి వెళ్ళిపోతున్నాను? నేను ఎక్కడికి వెళ్ళటం లేదు. నాకు వెళ్ళటానికి చోటు ఎక్కడ ఉంది? ఎవరి ప్రాణం అయితే ఆత్మలో లయం అయ్యిందో వాడికింక ప్రయాణం లేదు. ఎవరి ప్రాణం అయితే ఆత్మలో లయం కాదో, వాడు ప్రయాణం చేస్తాడు, వాడు ఇతర లోకాలకు వెళ్ళొచ్చు.

ఇతర జన్మలకు వెళ్ళొచ్చు. భగవాన్ అన్నారు నేను వెళ్ళిపోతున్నాను అని మీరు చెబుతున్నారు. Where can I go? నేను ఎక్కడికి వెళ్ళగలను? I am not going away నేను ఎక్కడికి వెళ్ళటం లేదు. ఒకవేళ వెళదాం అనుకుంటే చోటు ఎక్కడ ఉంది నాకు? ఆత్మ లేని చోటు ఉందా? ఆత్మ ఈ దేశానికి ఈ కాలానికి కట్టుబడుతుందా? ఒక యుగానికి కట్టుబడుతుందా? ఈ దేశం, కాలం, యుగాలు మనస్సు యొక్క కల్పితాలు. నేను భగవాన్‌ని దర్శించక పూర్వం శృంగేరి స్వాముల నుంచి ఉపదేశం పొందాను. ఆ సంగతి మా అన్నతో చెబితే, అతను ఏమన్నాడు అంటే నువ్వు శృంగేరి స్వాముల దగ్గర ఉపదేశం పొందావు, నేను సాక్షాత్తు ఈశ్వరుడి దగ్గర ఉపదేశం పొందుతాను అని మా అన్న అన్నాడు. మూడేళ్లు గడిచిన తరువాత అన్నయ్య భగవాన్ దర్శనానికి వెళ్ళాడు. అపుడు భగవాన్‌ని చూసినప్పుడు, తానెరిగిన వెంకట్రామన్‌ని చూసినట్టే భగవాన్‌ని స్థిరంగా చూశాడు. భగవాన్ కూడా అతని వంక అలానే చూసారు, అన్నయ్య తక్కున సాష్టాంగ పడ్డారు. చాలా రోజులు భగవాన్‌తో ఉండిపోయి తిరిగి వచ్చి నాకు ఈశ్వరుడు ఉపదేశం ఇచ్చాడు అని చెప్పాడు. తరువాత తరచూ భగవాన్ దగ్గరే ఉండిపోయే వాడు. సర్వ సాధారణంగా భగవాన్‌ని ఎవరైనా ఉపదేశం చెప్పండి అని అడిగితే ఉపదేశం ఉపదేశసారంలో ఉంది అని భగవాన్ చెప్పేవారు.

**కర్తు రాజ్ఞయా ప్రాప్యతే ఫలం, కర్మ కిం పరం కర్మ తజ్జడం ।**
**కృతి మహోదధౌ పతనకారణం, ఫల మశాశ్వతం గతి నిరోధకం ।**
**ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం, చిత్త శోధకం ముక్తి సాధకం ।**

చిత్తాన్ని శోధించిన వాడికి ముక్తి వస్తుంది. ఎవడైతే తన మనస్సుని శోధిస్తున్నాడో వాడికి ముక్తి లభిస్తుంది. చిత్త శోధకం ముక్తి సాధకం. ఎవడు ముక్తిని సాధిస్తాడు? చిత్తాన్ని శోధించినవాడు ముక్తిని సాధిస్తాడు. మరి మనం దేనిని శోధిస్తున్నాం, లోకాన్ని శోధిస్తున్నాం. మనం చేసేది అంతా లోకవిచారణ. ఆత్మవిచారణ కాదు. మనం పొందవలసిన వస్తువు ఏది? ఆత్మ. లోకవిచారణ చేస్తున్నాం, ఆత్మను పొందాలని చూస్తున్నాం. ఆత్మ ఎవరికి తెలుస్తుంది? ఆత్మవిచారణ చేసే వాడికి ఆత్మ తెలుస్తుంది. ఎవడైతే తన చిత్తాన్ని శోధిస్తున్నాడో, ఎవడైతే తన బుద్ధిని పరీక్షిస్తున్నాడో వాడికే మోక్షం వస్తుంది. మీ మనస్సుని పరిశీలించండి. మీ మనస్సులో ఏమి జరుగుతోందో చూడండి. మనం రోజూ ఎంత వంచనతోటి జీవిస్తున్నామో చూడండి. మనకు లోపల వచ్చే తలంపు వేరు, నోటి తోటి మాట్లాడే మాట వేరు. చేతితోటి చేసేది వేరు. ఇంక మీకు అహంకారం ఎలా తగ్గుతుంది?

ఇవి మూడు సమానంగా ఉండాలి. మనస్సు, మాట, చేత ఇవి మూడు కనుక సమానంగా ఉంటే అహంకారం పలుచబడి పోతుంది. మీరు ఏమనుకుంటున్నారు అంటే అభివృద్ధి అంటే మీరు అనుకున్న పనులు అన్నీ అయిపోతే అభివృద్ధి అనుకుంటున్నారు. ఆ పనులు అన్నీ అవ్వచ్చు, అవ్వకపోవచ్చు అది వేరే విషయం. మీరు అనుకున్న పనులు అన్నీ అయిపోవటం ఆధ్యాత్మిక అభివృద్ధి కాదు. మీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా మీ మనస్సు సమానంగా ఉంటే అది నిజమైన అభివృద్ధి. మీకు ఆధ్యాత్మిక అభివృద్ధి ఎప్పుడంటే, మీకు తలంపులు ఎప్పుడైతే తగ్గుతున్నాయో మీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా మనస్సు balancedగా ఎప్పడు ఉంటుందో అప్పడు మీరు ఆధ్యాత్మికంగా వికాసం పొందుతున్నట్టు గుర్తు. అంతే కాని బాహ్యంగా మీరు అనుకున్న పనులు అయిపోతూ ఉంటే అభివృద్ధి, లేకపోతే లేదని కాదు. అది మీరు చూసుకోండి. మీరు మంచి వార్తలు విన్నారు అనుకోండి, లేకపోతే చెడ్డ వార్తలు విన్నారు అనుకోండి అప్పడు మీ mind balancedగా ఉందా లేదా అది చూసుకోండి. Balancedగా ఉంటే మటుకు మీరు ఆధ్యాత్మికంగా వికాసం పొందుతున్నట్టు. ఏవండీ మీరు అనుకున్న పనులు అయిపోతే మీకు గర్వం వస్తుంది. అనుకున్న పని అయిపోతే అహంకారం పెరిగిపోతుంది. అనుకున్న పని అవ్వకపోతే కోపం వచ్చేస్తుంది. అది కాదు ప్రధానం. అనుకున్న పని అయినా, అవ్వకపోయినా మీ మనస్సు సమస్థితిలో ఉండాలి. అలా ఉంటోందా లేదా అది చూసుకోండి. మీ మనస్సు సమస్థితిలో ఉంటే మటుకు మీరు ఆధ్యాత్మికంగా వికాసం పొందుతున్నట్టే లెక్క.

రంగన్ అంటున్నాడు 1932లో మా అన్నయ్యకి క్షయ వచ్చింది, లేవలేనిస్థితిలో ఒకరి సహాయంతో భగవాన్ దగ్గరకు వెళ్ళాడు. ప్రదక్షిణం చేస్తుంటే బలహీనుడు అని వద్దు అన్నారు. అప్పడు అన్నయ్య నమస్కరిస్తూ ఏడుస్తున్నాడు. రంగన్ అన్నగారిని సాగనంపడానికి గడపదాకా భగవాన్ వచ్చారు. భగవాన్ కళ్ళల్లో కూడా కన్నీళ్ళు ఉన్నాయి. అంటే జ్ఞానికి కూడా కళ్ళ వెంట నీళ్ళు వస్తాయి. అయితే అది అజ్ఞానికి సంబంధించిన దుఃఖం అనుకోకండి. మనం ఏదైనా బాధ పడుతున్నాం అనుకోండి ఆ బాధకు ఆయన react అవుతాడు. ఆయనకి కూడా బాధవచ్చినట్టే అనిపిస్తుంది. ప్రపంచంలో ఎక్కడ, ఏ మూల కష్టం వచ్చినప్పటికీ స్పందిస్తాడు జ్ఞాని. ఎందుచేత అంటే ప్రపంచం అంతా ఉన్నది తానే. స్వామి వివేకానందకి ఎవరో కొన్ని విషయాలు చెబుతున్నారు, ఆయనకు కన్నీళ్ళు వచ్చాయి. స్వామీ మీరు కూడా కన్నీళ్ళు పెట్టుకుంటున్నారా, మేము ఏదో గృహస్థులం మీరు కూడా కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు ఏమిటి స్వామి అని వివేకానందని అడిగినప్పడు వివేకానంద ఏమి అన్నాడు అంటే నేను

రాయినా? రప్పనా? నాలో మటుకు స్పందన ఉండదా? లోపల సహృదయం కనుక ఉంటే వాడికి స్పందన కలుగుతుంది. మనకి కావాల్సింది సహృదయం. ఈ సహృదయం అనేది ఏదో ఒక ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేయరు. అయితే సహృదయం ఎలా వస్తుంది? మీ మనస్సుని నియమించుకొనే కొలది, మీ మనస్సుని కంట్రోల్ చేసుకునేకొలది మీకు సహృదయం ఆరోజుకారోజు వచ్చేస్తుంది. అది మీలోంచే ఉత్పత్తి అవుతుంది. లోపల నుంచే ఊరుతుంది అది, జ్ఞానం లోపల నుంచే ఊరుతుంది. అక్కడే ఉంది ఆత్మ వస్తువు. ఆ వస్తువు మటుకు మన శరీరంలో ఒక భాగం కాదు. మీ శరీరంలో ఒక భాగం కాదు కాబట్టి శరీరం కాలిపోయినా అది కాలదు.

భగవాన్ ప్రేమ ఇలా ఉంటుంది అని ఎవరైనా చెప్పినప్పుడు నేను నమ్మలేదు. కాని భగవాన్ ప్రేమను నా కళ్ళతోటి చూసినప్పుడు నేను నమ్మాను. ఒకసారి భగవాన్ అన్నారు మనుషులు పుడుతూ ఉంటారు, మరణిస్తూ ఉంటారు. ఇలా కలుసుకుంటూ ఉంటాం, విడిపోతూ ఉంటాం. ఇట్లా కలిపి, విడదీయటంలో ఈశ్వరుడి ఉద్దేశం ఏమిటో ఎవరు తెలుసుకోగలరు? ఒక మనుషులనే కాదు ఏదైనా ఒక వస్తువును మనకు ఎందుకు ఇస్తాడు? మళ్ళీ తిరిగి తీసుకుపోయినప్పడు ఎందుకు తీసుకుపోతాడు. ఇది ఎవరికి తెలుసు? ఈశ్వరుడికే తెలుసు. రమణస్వామి ఏమంటున్నారు అంటే మనుషులను ఎందుకు కలుపుతున్నాడో, ఎందుకు విడదీసేస్తున్నాడో, ఎందుకు వస్తువులు ఇస్తున్నాడో, ఎందుకు పట్టుకు పోతున్నాడో ఎవరికి తెలుసు? ఈ మాయ అంతా ఎవరికి తెలుసు? ఈ మహిమ అంతా ఎవరికి తెలుసు? ఆయనకు తెలుసు. అంటే ఈశ్వరుడికి తెలుసు, ఎందుచేత ఈ మాయ యొక్క ప్రభువు ఆయనే. ఈ మాయ మనల్ని ఆడిస్తుంది కాని ఆయనను ఆడించదు. ఈశ్వరుడి చేతిలో మాయ ఉంది. మాయ చేతిలో మనం ఉన్నాం. ఎవడైతే ఈ మాయని దాటుతున్నాడో వాడు ఈశ్వరుడి పాదాలను చేరుకుంటాడు. రామకృష్ణ పరమహంస గారు ఈ ఉదాహరణ చెప్పారు. ఎవడైతే వల వేస్తున్నాడో ఆ వల వేసేవాడి పాదాల దగ్గరకు చేప కనుక వస్తే ఆ చేప వలలో పడదు. అదే విధంగా ఈశ్వరుడి పాదాలను కనుక మనం పట్టుకుంటే, మాయ వేసిన వలలో మనం పడం. ఈశ్వరుడికి శరణాగతి కనుక మనం పొందితే మనం మాయ అనే వలలో పడము అని చెప్పాడు.

రమణస్వామి ఎంతసేపు ఆత్మ గురించే చెబుతాడు. సాధన గురించి రమణస్వామి ఎక్కువ చెప్పలేదు. ఎప్పడూ ఆత్మ అంటాడు. ఆత్మను తెలుసుకోవటానికి ఏ సాధన చెప్పాడు

రమణస్వామి అని కొంతమంది ఆక్షేపిస్తూ ఉంటారు. అసలు సాధన చేసేవాడినే తీసేయమంటుంటే, ఇంక సాధన గురించి ఏమి చెబుతాడు ఆయన. సాధన ఏమి చెప్పాడు రమణస్వామి అంటే, ఆ సాధన చేసేవాడిని తీసి ఒక పక్కన పెట్టు అని చెప్పాడు అది సాధన. అంటే మీ అహంకారంతో నువ్వు ఏమి సాధన చేయగలవు. మీ అహంకారం ఎంతవరకు సాధన చేస్తుంది. నువ్వు ఎప్పుడైనా రామ అన్నావంటే, ఎప్పుడైనా కృష్ణా అన్నావంటే ఆ కృష్ణుని అనుగ్రహం లేకుండా, ఆ రాముడి యొక్క అనుగ్రహం లేకుండా ఆత్మ యొక్క అనుగ్రహం లేకుండా నువ్వు ఆత్మను స్మరించగలవా? రామా అనగలావా? నువ్వు కృష్ణా అనగలవా? నువ్వు సాధన చేయటానికి ఎంతటి వాడవు? సాధన చేసేవాడిని ఒక పక్కన పెట్టు, వస్తువు నీకు ప్రత్యక్షం అవుతుంది. లోపల ఉన్న వస్తువు నిన్ను తీసుకోకపోతే, నువ్వు గ్రహించటానికి నీ అహంకారానికి అంత శక్తి ఉందా? నీ అహంకారం వస్తువును తెలుసుకోగలదా?

శరీరాన్ని విడిచి పెట్టాలని నాకు లేదు కాని నన్ను శరీరం విడిచి పెట్టేస్తుంది. ఈ దేహం మీద ఉన్న ప్రేమ మనకు ఈశ్వరుడి మీద ఉందా? ఈ దేహం కోసమే కదా మనం తాపత్రయపడేది? ఈ దేహం యొక్క గౌరవాల కోసం, గొప్పల కోసమే కదా మనం తాపత్రయ పడేది. నువ్వు ఈశ్వరుడి కోసం నీ శవాన్ని ఎప్పుడైనా మర్చిపోయావా? నీ ఇల్లుని కాని, నీ ధనాన్ని కాని, నీ చదువుని కాని, నీ శరీరాన్ని కాని, నీ గౌరవాలు కాని, నీ అధికారాలు కాని ఎప్పుడైనా ఈశ్వరుడి కోసం నువ్వు మర్చిపోయావా? నిద్రావస్థలో మీ శరీరాలు గొడవ లేకుండా ఉన్నారు కాని, జాగ్రదావస్థలో మీ శరీరాన్ని మర్చిపోయి, మీ మనస్సుని మర్చిపోయి, మీ రాగ ద్వేషాలని మరచి పోయి, మీ ఇష్టాలను మర్చిపోయి, మీ అయిష్టాలను మర్చిపోయి, ఎప్పుడైనా కొన్ని క్షణాలు మీరు దేవుడిని ప్రేమించారా? ఎవరిని మోసం చేయటానికి ఈ మాటలు, ఈ చేష్టలు. మీరు దేహాన్ని ఎప్పుడైనా మర్చిపోయారా? మీరు ధనాన్ని ఎప్పుడైనా మర్చిపోయారా? మీ ధనాన్ని ఎవరికీ ఇవ్వద్దు. కాని ఎప్పుడైనా మీకు మరుపు వచ్చిందా



**ఈశ్వర స్మరణ వడ్డించిన విస్తరి వంటిది.**

**ఈశ్వర స్మరణ వలన మనస్సుకు పవిత్రత వస్తుంది.**

**లోపల ఉన్న వాసనలు నశిస్తాయి.**

మీ ధనం? మరుపు రాదు. మన మనస్సు అక్కడే ఉంది. మన మనస్సు దేవుడి మీద లేదు. ఎక్కడ ఉంది? శరీరం మీద ఉంది కాబట్టి శరీరాలు వస్తాయి. మన మనస్సు ధనం మీద ఉంది అందుచేత ధనం వస్తుంది. గౌరవాల మీద ఉంది అందుచేత గౌరవాలు వస్తాయి. మన మనస్సు ఆత్మ మీద లేదు కాబట్టి ఆత్మ దొరకదు, ఆత్మ దొరకదు, ఆత్మ దొరకదు. అసలు మనస్సును ఆత్మ మీద ఎప్పుడూ పెట్టలేదు మనం, మన లక్ష్యం అది కాదు. దేహం మీద ఉన్న గౌరవం కూడా మనకి చైతన్యం మీద లేదు. తెలుసుకోవటం మాట వదిలేయండి అసలు గౌరవమే లేదు. ఎవడికైనా గొప్ప గుణాలు ఉంటే ఆ గుణాలు చూసి సంతోషించే శక్తే మనకు లేనప్పుడు ఆ గుణం మనకి ఎలా వస్తుంది? మనం ఎలా నేర్చుకోగలం? మీరు చేసే సాధనలు అన్నీ ఈశ్వరుడి ప్రీతి కోసమే మీరు చేస్తున్నారా? ఏదైనా దానం చేస్తే ఈశ్వరుడి ప్రీతి కోసమేనా? ఏదైనా మంచి పని చేస్తే ఈశ్వరుడి ప్రీతి కోసమేనా? లేకపోతే కారం కోసమా? రామకృష్ణుడి తోటి ఒక అమ్మగారు అంటున్నారు ఏవండీ నేను చేసిన దానాలు ఎన్నో, ధర్మాలు ఎన్నో మీకు తెలుసా, కాశీలో కూడా ఒక రేవు కట్టించాను అని చెప్పారు. ఎంత గొప్ప పని చేసావు అమ్మా అని రామకృష్ణుడు అంటుంటే, అదంతా నిజం అనుకుని గబుక్కున రామకృష్ణుని పాదాలు ముట్టుకోటానికి లేచి వెళుతుంటే, ఒక్క సారే ఆయన ఎగిరి గంతు వేసి వెనక్కి తప్పకున్నారు. అంటే ఇంత అహంకారం ఉన్న మనిషి చేత నమస్కారాలు పెట్టించుకుంటే మళ్ళీ కాళ్లు కడుక్కోవాలి. నేను చేశాను నేను చేశాను అనే అహంకారం కనుక నువ్వు పెంచుకుంటుంటే చీకటి లోకాల్లో మునిగిపోతావు. బాహ్యానికి మంచి పని చేసినట్టు నీకు అనిపించవచ్చు. కాని నువ్వు సమాజానికి పైసా ఉపకారం చేసి దాని వలన రూపాయి అహంకారం తెచ్చుకుంటే నువ్వు పతనం అయిపోతావు.

ఆత్మ సుఖం ఎప్పుడో ఏదో దశలో మనం అనుభవించాం. అందుచేత దాని ఎరుక తోటి ఆత్మ సుఖాన్ని తిరిగి పొందాలి అని దాని కోసం పరుగు పెడుతున్నాం. పూర్వం కనుక ఆ సుఖం యొక్క రుచి మనం చూసి ఉండకపోతే ఆ సుఖం కోసం మనం ఎక్కడకు పరుగు పెడతాం? దేహం తోటి తాదాప్యం ఉన్నంతకాలం, దేహాత్మబుద్ధి ఉన్నంతకాలం వాడిని కామం విడిచి పెట్టదు. దేహం వస్తే కామం వచ్చి తీరుతుంది. దేహం ఉండగానే ఆ దేహం తోటి సంబంధం ఎవడికి అయితే తెగిపోయిందో, దేహబుద్ధి పోయి ఆ దేహంలో ఉండగానే ఆత్మబుద్ధి ఎవడికి అయితే కలిగిందో వాడిని ఇష్టాలు అయిష్టాలు విడిచి పెడతాయి, రాగ ద్వేషాలు విడిచి పెడతాయి, కామ క్రోధాలు విడిచి పెడతాయి. రాగ భయ క్రోధాలు జ్ఞానిని విడిచి పెడతాయి కాని దేహాత్మబుద్ధి ఉన్నవాడిని విడిచి పెట్టవు. ఇంతకు ఆ గొడవ

వదిలి వేయండి, మీరు గణపవరంలో చూసినా సరే, భీమవరంలో చూసినా సరే, మద్రాసులో చూసినా సరే మనకి పుట్టుక రాకుండా birth కంట్రోల్ చేసే డాక్టరు గారిని చూడండి. నేను సరదాగా చెబుతున్నాను అని మీరు అనుకోవద్దు. ఈ సాధనలు అక్కర్లేదు, ఉపన్యాసాలు అక్కర్లేదు, భగవద్గీత చదవక్కరలేదు. వేదం పారాయణాలు అక్కర్లేదు. పూజలు అక్కర్లేదు. Birth control రైటే, నాకు తిరిగి birth రాకుండా నేను control చేసుకోగలనా? అలా control చేయగల డాక్టరు ఎవరైనా ఉన్నారా ఈ విశ్వంలో?

సోదరమహాశయులారా! ఇక్కడ ఒకతను అంటున్నాడు నాకు పిల్లలు ఎక్కువ మంది పుడుతున్నారు నాకు భయం వేస్తోంది, పెళ్ళిళ్ళు చేయటం కష్టం అందుకు భయం వేస్తోంది అని ఒకడు అన్నాడు. అలా నువ్వు భయపడకు, పిల్లల గురించి అలా భయపడుతుంటే నీకు ఎక్కువమంది పిల్లలు పుడతారు. ఈ పిల్లల తోటే సరిపోలేదు ఇంకా బహుశా కొన్ని కష్టాలు రాసి ఉన్నాయి నీకు, ఈ శరీరంలో ఆ కష్టాలు కూడా నువ్వు అనుభవించాలి అని భగవాన్ వాడితోటి అన్నారు. ఆ భక్తుడికి భగవాన్ మీద ఎంత ప్రేమో, ఎంత గురో చూడండి, నాకు కష్టాలు ఉన్నాయని చెబుతున్నావు. నాకు కష్టాలు ఏమి లేవు. నీ దర్శనానికి వచ్చినప్పుడు నా కష్టాలు అన్నీ రాలిపోయాయి. నా కష్టాలు అన్నీ ఆరిపోయాయి. నిన్ను చూసిన నాకు కష్టాలు ఉంటాయా అంటున్నాడు. ఏమి dialogue చూడండి. నీ సంతానం ఎక్కువ మంది అని బాధ పడుతున్నావు. సంతానమే కాదు ఇంకా నీ ఒంటి మీద కొన్ని కష్టాలు ఉన్నాయని భగవాన్ చెబుతుంటే, సరదాగా ఒకవేళ చెప్పి ఉండవచ్చు ఆయన, భగవాన్ చెబుతుంటే వాడు అన్నాడు నాకు కష్టాలు ఏమిటి స్వామి నిన్ను చూశాను కదా, నిన్ను చూసిన తరువాత కూడా కష్టాలు ఉంటాయా? సూర్యుడు వచ్చాక చీకటి ఉంటుందా? దేవుడిని చూసిన తరువాత దుఃఖం ఎక్కడ ఉంటుంది? ఏమి dialogue చూడండి ఇది. నా కొడుకు ఒక పెద్ద బావిలో పడ్డాడు. గాయమై నెత్తురు వరదగా కారుతుంటే ఇంటికి తెచ్చారు. ఆ రాత్రి అతనికి ఒక నల్లటి ఆకారం కనపడింది, ఆ నల్లవాడి రూపంలో మృత్యువు వచ్చి వాడి మీద పడుతుంటే భగవాన్ ఒక కర్ర తీసుకుని వాడిని వెళ్లగొట్టారు అట, ఆసుపత్రికి తీసుకుని వెళ్లాం, డాక్టర్లు ఆశ లేదు, మీ అబ్బాయి బ్రతకడు బయటకి పొమ్మన్నారు. కాని నెలలో బ్రతికి బయట పడ్డాడు. తరువాత కొన్నాళ్ళకి మీనాక్షికి మొగ పిల్లవాడు పుట్టాడు. అతనికి భగవాన్ రోజూ రెండు నారింజ పళ్ళు పెట్టించారు ఆశ్రమంలో, ఏ మందు లేకుండా నయం అయ్యింది అతని లివర్ complaint. నా భార్య భగవాన్ పటం దగ్గరకు పరుగెత్తుకుని వెళ్లి, నీ కరుణ వల్లనే మేము సురక్షితంగా ఉండటం నిజం అయితే, మా కోడలు తిరిగి ఊపిరి పీల్చాలి అని

విభూతి తెచ్చి వొళ్ళంతా రాసింది. ఊపిరి తిరిగి వచ్చింది. ఇవన్నీ రంగన్ కుటుంబానికి భగవాన్ చేసినటువంటి మహిమలు. అయితే ఇదంతా మీరు ఆత్మ అనుకోకండి. ఇవి బాహ్యంగా జరిగినటువంటి కొన్ని మహిమలు, భగవాన్ వీటికి ప్రాముఖ్యత ఎప్పడు ఇవ్వలేదు. కాని రంగన్ తన కుటుంబానికి జరిగిన విషయం మటుకు ఇక్కడ చెబుతున్నాడు. ఓ సారి విల్లుపురంలో రాత్రి రంగన్ ఎక్కవలసిన రైలు వెళ్ళిపోయింది. తిరిగి మధ్యాహ్నం దాకా రైలు లేదు. భగవాన్‌ను చూడటానికి లేటు అవుతోందని విచార పడుతున్నాను. ఆ స్టేషన్ మాస్టారు నా మిత్రుడు. నన్ను గూడ్స్ రైలు ఇంజనులో ఎక్కించి పంపాడు. ఆ డ్రైవర్ బండి స్లో చేస్తే గబా గబా దిగిపోతే కింద పడి దెబ్బలు తగిలినవి. రోడ్డు కనపడదు, ఆ చీకట్లో, ముళ్ళల్లో, కంచెల్లో పడి పడి ఆశ్రమం చేరుకున్నాను. భగవాన్ నా దెబ్బలు చూసి ఏమిటవి అని అడిగారు. విషయం అంతా తెలుసుకుని నా దగ్గరకు అంత తొందరపడి, అంత కష్టపడి గూడ్స్ ట్రైన్‌లో ఎందుకు వచ్చావు అని ఆయన కోప్పడ్డారు. నిన్ను చూడకుండా ఉండలేక, నిన్ను చూడాలని వేగంతోటి, స్వామిని చూడాలి అని ఆత్రుత తోటి, ఏ కష్టం అనేది తెలియకుండా గూడ్స్ బండిలో వచ్చి నీ దగ్గర పడ్డాను అన్నాడు రంగన్. అప్పడు భగవాన్ ఏమన్నారు అంటే దర్శనం కన్నా దర్శనం కోసం ఆవేదన ముఖ్యం రంగన్ అన్నారు. భగవాన్ ఏమి అన్నారంటే నువ్వు నన్ను చూడాలని ఆప్యాయం తోటి వచ్చేశావు. కాని నన్ను చూడటం కంటే భగవాన్‌ని ఎప్పడూ చూడలేదే అనే తపన నీకు ఆధ్యాత్మికంగా ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. భగవాన్‌ని చూడటానికి నువ్వు ఇంత వేదనగా వచ్చావు. భగవాన్‌ని చూసిన దానికంటే భగవాన్‌ని ఇంకా చూడలేదే, భగవాన్‌ని చూడలేదే అనే వేదన ఎక్కువ సార్లు ఉంటుంది. ఉదాహరణ చెప్పమంటారా నేను మీ ఇంటికి ఎవరి ఇంటికైనా చూడటానికి వచ్చాను అనుకోండి, మీరు ఇంటికాడ లేరు అనుకోండి, నేను ఇంటికి వెళ్ళిపోయిన తరువాత అస్తమాను మీరే జ్ఞాపకం వస్తూ ఉంటారు. తీరా చూడటానికి వెళ్లాం వారు కనపడలేదు అని, చూసేసాం అనుకోండి, చూస్తే మళ్ళీ వారు జ్ఞాపకం రారు. చూసిన దానికంటే కూడా చూడాలి అనే వేదన ఇంకా ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. అరుణాచలం వెళ్ళిన వారి కంటే అరుణాచలం ఇంకా వెళ్ళలేదు. అరుణాచలం ఇంకా నేను చూడలేక పోయాను. అని వేదన పడేవాళ్ళకి అరుణాచలం చూసిన వారికంటే ఎక్కువ పుణ్యం వస్తుంది. ఎందుచేత అంటే మీ దేహం దూరంగా ఉండవచ్చు. కాని మీరు మనస్సుతోటి అరుణాచలానికి దగ్గరగా ఉన్నారు. అరుణాచలం చూడలేదు అని మీకు ఎంతో బాధగా ఉండవచ్చు. మన జీవితంలో తల్లి కడుపు లోంచి బయటకు వచ్చాక ఎన్నో బాధలు పడ్డాము, ఎన్నో కన్నీళ్లు కార్చాం, కాని

ఈశ్వరుడి కోసం ఒక్క కన్నీటి బొట్టు మనం కార్చామా? మీరు జ్ఞాపకం తెచ్చుకోండి ఎన్ని సార్లు వచ్చాయో మన కళ్ళ వెంట నీళ్ళు, కాని ఈశ్వరుడి కోసం ఎప్పడైనామనం ఏడ్చామా? మీరు ఎవరైనా చెప్పండి ఈశ్వరుడి కోసం మీకు ఎప్పడైనా, ఎవరికైనా కన్నీళ్లు వచ్చాయా? మన మనస్సు కరగాలి, కరిగితేనే కాని అది హృదయంలో లయం అవ్వదు.

సోదరమహాశయులారా! మనస్సు కరగకుండా అది హృదయంలో లయం కాదు, అది ఆత్మాకారం చెందదు. మనస్సు కరగాలి. అహంకారం కరగాలి. రామకృష్ణుడికి పరమహంస అని పేరు, హంస నీళ్లని, పాలును కలిపేస్తే, నీళ్లని వదిలేసి పాలుని తాగేస్తుంది. ఇప్పడు ప్రకృతి తత్త్వం కలిసిపోయి ఉన్నాయి, ప్రకృతిని విడదీసి తత్వాన్ని తీసుకోలేక పోతున్నాం, అది ఎవరు చేశాడు? రామకృష్ణుడు చేసాడు కాబట్టి ఆయనకి పరమహంస అని పేరు వచ్చింది. అలా మనం కూడా విడదీయాలి, ఏది ప్రకృతి? ఏది ఆత్మ? ఏది ప్రకృతి? ఏది చైతన్యం? అని దానిని విడదీసుకోవటానికి శక్తి కావాలి. ఆ రకంగా విడదీసుకునే బుద్ధి కావాలి. ఆ బుద్ధి కోసమే జపం, పూజ, ధ్యానం. కూర్చోవటం బాగానే కూర్చుంటున్నాం కానీ ధ్యానం కుదరటం లేదు అంటారు. అందరి complaint ఇదే. దేవుడి బొమ్మ ఎదురుగా పెట్టుకొని కూర్చుంటున్నాము. Comfortableగా కూర్చుంటున్నాము. కాని ఏమి చేస్తాం ఈ మనస్సు మటుకు కుదురుగా ఉండటం లేదు అని ఇదే Complaint. ఎందుకు మీకు మనస్సు కుదురుగా ఉండటం లేదు. మీరు ధ్యానంలో కూర్చుని ఉండగా మీకు ఏది జ్ఞాపకం వస్తోంది ఇక్కడ కూర్చున్న వారిలో ఎవరైనా చెప్పండి. మీరు ధ్యానం చేసేటప్పడు మీ మనస్సు నిలబడటం లేదు అని చెబుతున్నారు. దేవుడి దగ్గర నిలబడటం లేదు కాని మీ మనస్సు ఎక్కడో ఒక చోట నిలబడుతోంది. ఎక్కడ నిలబడుతోంది? మీకు ప్రేమ ఉన్న చోట, మీకు ఇష్టం ఉన్న చోట అది నిలబడుతుంది. మీకు దేవుడి మీద ప్రేమ లేదు, మీకు దేవుడి మీద ఇష్టం లేదు. అందుచేత దేవుడి మీద నిలబడటం లేదు. మీ ఇష్టాలు వేరు, మీ ఆదర్శాలు వేరు, మీ ఆశయాలు వేరు, మీ ఆకాంక్షలు వేరు, మీ అభిరుచులు వేరు, అది దేవుడి మీద నిలబడమంటే ఎలా నిలబడుతుంది? నీకు అనేక రహస్యాలు ఉన్నాయి, నీ హృదయంలో అనేక కాంక్షలు ఉన్నాయి. మీ కాంక్ష ఎక్కడ ఉందో, మీ ఆదర్శం ఎక్కడ ఉందో, మీ కోరిక ఎక్కడ ఉందో, అక్కడికే మీ మనస్సు పరుగు పెడుతుంది కాని దేవుడి దగ్గర నిలబడటానికి, కట్టేయడానికి అది దూడ కాదు కదా! దానిని కట్టేసి ఉంచగలరా? దేవుడి మీద మీ మనస్సు నిలబడటం లేదు అంటే మీకు దేవుడి మీద ఇష్టం లేదు, దేవుడి మీద మీకు ప్రేమ లేదు, దేవుడి మీద మీకు ఆప్యాయత లేదు. దేవుడి మీద మీకు ఆకాంక్ష లేదు. అందుచేత

అక్కడ మనస్సు నిలబడటం లేదు. దేహాన్ని అయితే బాగానే కూర్చొబెట్టారు కానీ మీ మనస్సు ఎక్కడికో పోతోంది, అది ఎక్కడకు వెళుతోంది? మీకు ఎక్కడ ఇష్టం ఉందో అక్కడకు వెళుతుంది. దానిది తప్ప ఏముంది? మీ ఇష్టం దేవుడి మీదకు మార్చుకోండి. అప్పుడు మీ మనస్సు అక్కడే ఉంటుంది. మా మనస్సు అటు ఇటు చలించిపోతోంది. మాకు ధ్యానం నిలబడటం లేదు, మా మనస్సు కదిలిపోతోంది అని రమణస్వామి తోటి చెబితే, మీ మనస్సు కదిలిపోతోంది అంటున్నారు, నా మనస్సుని కదలమంటున్నాను అది కదలటం లేదు నేను ఏమి చేస్తాను అన్నారు. ఎక్కడకు కదులుతుంది అది? నీకు ఎక్కడైతే ఇష్టం ఉందో, నీకు ఎక్కడైతే ప్రేమ ఉందో, నీకు ఎక్కడైతే విశ్వాసం ఉందో, నీ గురి ఎక్కడ ఉందో, అక్కడ నీ మనస్సు ఉంటుంది.

దేవుడి బొమ్మ దగ్గర పెట్టుకున్నారు. మీరు భౌతికంగా దేవుడికి దగ్గరగా లేరు అని నేను అనటం లేదు. మీరు భౌతికంగా దగ్గరగా ఉన్నారు. కాని మానసికంగా మటుకు దేవుడికి దూరంగా ఉన్నారు. అందుచేత మీ మనస్సుతో ధ్యానం చేయలేరు. మీరు నేను ఎంత దగ్గరగా కూర్చున్నా మీరంటే నాకు ఇష్టం లేదు, నేనంటే మీకు ఇష్టం లేదు అనుకోండి. ఒకే ఇంట్లోనే ఉన్నాం కాని ఎడ మొఖం, పెడ మొఖం. కొంతమంది అత్తా కోడళ్ళు చూడండి. ఉండటం ఒక ఇంట్లోనే ఉంటారు. మనస్సులు ఎంతో దురాన ఉంటాయి. శరీరాలు దగ్గరగానే ఉంటాయి. సమాజం కోసం మా కోడలు చాలా మంచిది అండి అని అత్తగారు చెబుతుంది, మా అత్తగారు చాలా మంచి ఆవిడ అని కోడలు చెబుతుంది. సమాజంలో గౌరవాలు ఎక్కడ పోతాయో అని ఇలాచేయటం. ఇలా మనం సమాజాన్ని మోసం చేయవచ్చు కానీ మన హృదయంలో ఏముందో ఈశ్వరుడు చూస్తాడు. మిమ్మల్ని మీరు మర్చిపోయి ఈశ్వరుడిని ప్రేమించారా? రమణస్వామిని మేము చూడలేదు, రమణస్వామిని మేము చూడలేదు అని కొంతమంది అంటూ ఉంటారు. రమణస్వామిని చూడలేదు చూడలేదు అనటానికి రమణస్వామి అంటే ఆ దేహమా? రమణస్వామి ఇక్కడ లేడా? ఇప్పుడు లేడా? ఆయన లేని కాలం ఎక్కడ ఉంది? ఆయన లేని దేశం ఎక్కడ ఉంది? దేవుడిని మీరు చూడటం కాదండి, ఈ నేను ఎవడు అనే బోధ మిమ్మల్ని దేవుడిని చేసేయాలి. దేవుడిని మీరు చూడటం కాదు, మీరు దేవుడు అవ్వాలి. ఆ అంతస్తులోకి మీరు ఎదగాలి. అంత గొప్పస్థితిలోకి మిమ్మల్ని తీసుకు పోవటం కోసం, అంటే జ్ఞానవంతులని చేయటం కోసం, ఆత్మసామ్రాజ్యానికి అధిపతులుగా చేయటం కోసం ఈ నేను ఎవరు అనే ప్రయత్నం.

మీరు మానసికంగా ఎంత ఎదిగారో, మీ దైనందిన జీవితంలో మీ expressionలోనే తెలిసిపోతూ ఉంటుంది. మీ మనస్సు ఎంతవరకు వికసించిందో, మీ మాటలో తెలిసిపోతుంది. మానసికంగా మీరు ఎదగలేదు అనుకోండి. మానసికంగా చంటిపిల్లలు లాగా ఉన్నారు అనుకోండి, మీకు ఎన్ని డిగ్రీలు ఉన్నప్పటికీ, ఆధ్యాత్మికంగా వికాసం పొందలేరు. చాలామంది ఏమి అనుకుంటారు అంటే రూపాయలు కంటే చదువు గొప్పది అని కాని రూపాయలు ఎటువంటివో, చదువు అటువంటిదే. ఎంత చదువు చదివినప్పటికీ పొట్ట కోసమే, వాడి లక్ష్యం ఏమిటి? పొట్ట కోసమే, అందుకే వాడికి ఆత్మ తెలియదు. అందరూ బంగారాన్ని కోరుతున్నారు రైటే, మీ మనస్సుని బంగారం చేసుకోండి అప్పుడు భగవంతుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు. ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. మా రమణస్వామిని చూసి రండి, ఆయన చాలా గొప్పవాడు, మానవరూపం ధరించి ఉన్నాడు. ఆయన సాక్షాత్తు ఈశ్వరుడే అని భగవాన్ గురించి ఎన్నో చెప్పి ఒక అబ్బాయిని భగవాన్ దగ్గరకు పంపించాము. అతను వెళ్ళి చూసి తిరిగి వచ్చేసి మా దగ్గర ఇలా అన్నాడు "మంచి రోజు చూసుకుని ఏకాదశి రోజున వెళ్ళాను. ఏకాదశి రోజున ఎంత గొప్ప పూజలో ఉంటాడో, ఎంత గొప్ప జపం చేస్తూ ఉంటాడో అనుకున్నాను తీరా వెళితే గోచీ పెట్టుకొని ఉల్లిపాయలు తరుగుకుంటున్నాడు పీట మీద కూర్చుని, వాడు దేవుడా? ఇంతకంటే గొప్పవాడు మీకు దొరకలేదా? ఏదో వేషం వెయ్యాలి కదా, సవారిలో కూర్చోవాలి, పీఠాధిపతి అయ్యుండాలి. ఒంటి నిండా దండలు వెయ్యాలి. ఇప్పుడు నేనే ఉన్నాను అనుకోండి తెల్లబట్టలు తీసేసి ఎర్ర బట్టలు కట్టుకుంటే మీరు స్వామివారు స్వామివారు అంటారు. మీ అందరి చేత నేను గౌరవం ఎక్కువ పొందాలి అంటే ఈ బట్టలు తీసేయాలి. ఎవరినో నలుగురిని ఎదర పెట్టుకుని స్వామివారు వస్తున్నారు తప్పుకోండి తప్పుకోండి అనాలి. నేనే పురమాయించుకోవాలి నలుగురిని, లేకపోతే ఎవరు వస్తారు నా కూడా? మనకు మాయే ఎక్కువ ఇష్టం. నిజం ఇష్టం ఉండదు మనకు మాయే ఇష్టం. అందుచేత మీ అందరిచేత ఎక్కువ గౌరవం

**భగవద్గీతలో ఫలితం మీద ఆసక్తి పెట్టుకోవద్దు అని చెప్పాడు కాని, ఫలితాన్ని ఇవ్వను అని ఎక్కడా కూడా అనలేదు భగవంతుడు. అంటే మీరు ఫలితం యందు ఆసక్తి లేకుండా పని చేస్తే మీకు ఫలితం వస్తుంది, మోక్షం కూడా వస్తుంది.**



పొందాలి అంటే నేను ఇప్పుడు తెల్ల బట్టలు తీసేసి కాషాయ బట్టలు వేసుకోవాలి. నాకు అలా వేసుకుందాం అనిపిస్తుంది కాని గౌతమ బుద్ధుడు ఏమి అంటున్నాడు అంటే "నీ హృదయంలో కషాయం ఉండగా, నీ హృదయంలో కల్మషం ఉండగా, కాషాయ బట్టలు ఎందుకు?" అన్నాడు. రంగన్ ఏమి చెబుతున్నాడు అంటే నువ్వు దేవుడికి పూజ చేస్తున్నావు. నువ్వు చేస్తున్నావు అని ఆయన కూడా దేవుడికి పూజ చేయాలి కదా అనుకొంటున్నావు. ఆయనకు పూజ చేయటానికి దేవుడు ఎక్కడ ఉన్నాడు? ఎవరికి పూజ చేయడం? జ్ఞానికి కొలవడానికి, పూజ చేసేందుకు జ్ఞానికి ఇతరులు ఎవరు లేరు. దేవుడే కాదు జ్ఞానికి లోకం లేదు, దేహం లేదు, విశ్వం లేదు, సూర్య చంద్రులు లేరు. జ్ఞానికి ఏమి లేదు ఇంక ఎవరికి చేస్తాడు? జ్ఞానికి ద్వైతం లేదు. సోదరమహాశయులారా! జ్ఞానికి తనకంటే వేరుగా ఏది లేదు. వాడికి దేహం లేదు. జ్ఞానికి దేహం ఉన్నట్టు మనకి కనిపిస్తుంది. జ్ఞానికి ప్రపంచం ఉన్నట్టు మనకు కనిపిస్తుంది. జ్ఞాని ఎవరినో ఆరాధించినట్టు మనకు కనిపిస్తుంది. కాని జ్ఞానికి ద్వైతం లేదు? అహంకారానికి దేవుడు కావాలి. అహంకారానికి లోకం కావాలి. అహంకారానికి గొప్పలు కావాలి. అహంకారానికి శరీరం కావాలి. అక్కడ అహంకారంలో కారం లేదు అందుచేత జ్ఞానికి లోకం లేదు, జ్ఞానికి శరీరం లేదు, జ్ఞానికి దేవుడు లేడు, జ్ఞానికి దేని తోటి పని లేదు. వాడు సుఖ స్వరూపుడు, వాడు ఆత్మ స్వరూపుడు. రంగన్ అంటున్నాడు నా మిత్రునికి నేను ఎంత చెప్పినా అర్ధం కాలేదు. అర్హత ఉంటేనే కాని, యోగ్యత ఉంటేనే కాని, తానెవరో ఎవరికీ తెలియనివ్వరు రమణస్వామి. మాములుగా మన లాగే కనిపిస్తారు. అర్హత ఉంటే, యోగ్యత ఉంటేనే ఆయన గురించి తెలుస్తుంది. రమణస్వామి ఏమి మాట్లాడకుండా ఆయన చూసినంత మాత్రం చేతనే జీవితాలు అన్నీ మారిపోయి కొంతమందికి మోక్షం వచ్చింది. ఈ మాట మీ హృదయంలోనే రహస్యంగా ఉంచుకోండి. ఎన్ని బోధలు విన్నా ఒకొక్కసారి మన మనస్సు మారదు. ఎన్ని పూజలు చేసినా మన మనస్సు మారదు. ఎంత శ్రవణం చేసినా మన మనస్సు మారదు. కానీ కొంతమందికి రమణస్వామిని చూసిన వెంటనే వాళ్ళ మనస్సు మారిపోయింది, వాళ్ళ ఆదర్శం మారిపోయింది. వాళ్ళు ఎక్కడికి వెళ్ళాలో వాళ్ళ గమ్యం, స్పష్టంగా వాళ్ళ మనస్సుకి స్ఫురించింది. ఆయన ఏమీ మాట్లాడలేదు ఒక చూపు ద్వారానే అర్ధం అయ్యింది. చూస్తే చాలు జీవితాలు మారిపోయాయి కొందరికి. అంటే రమణస్వామి తాను ఎంతటివారో ఎవరికి తెలియనివ్వరు. అర్హత లేనప్పడు, యోగ్యత లేనప్పడు, deserve కానప్పడు తాను ఎంతటి వాడో ఎవరికీ తెలియనివ్వరు. ఒక్క జ్ఞాని మాట ఎందుకు అండి మంచి గుణాలు ఉన్నవాడిని కూడా

మనం తెలుసుకోలేము మనలో ఆ గుణాలు లేనప్పుడు. మీకు కనుక అర్హత ఉంటే మీరు అమెరికాలో ఉన్నా తెలుస్తుంది భగవాన్ గురించి. మీకు అర్హత లేకపోతే భౌతికంగా దగ్గరగా కూర్చున్నా తెలియదు. మీకు సహృదయం ఉంది అనుకోండి మీరు రష్యాలో ఉంటున్నారు అనుకోండి భగవాన్ మాటలు మీరు పట్టుకోగలరు. మీకు సహృదయం లేదు అనుకోండి మీరు అరుణాచలంలోనే ఉన్నా ఆ గోడలు ఎంతో, ఆ చెట్లు ఎంతో మీరు అంతే. అరుణాచలంలో మీ దేహం ఉంది కాని మీ మనస్సు ఎక్కడ ఉందో ఎవరికి తెలుసు? నాకు తెలుసా? మీకు తెలుసా? అది ఈశ్వరుడికి తెలుసు.

**ఊరూరు తిరుగక ఊరూరు తిరుగక యుల్లము**
**నినుగని యణగ నీ ద్యుతి చూపు మరుణాచలా॥**

మనస్సును స్వాధీనం చేసుకోవటం కోసం మీరు ఎంతో కష్టపడుతున్నారు. ఆత్మను చూస్తేనే కాని మీ మనస్సు లొంగదు. ఈశ్వరుడిని చూస్తే కాని అది అణగదు. నా మనస్సు అణగటం కోసం నీ స్వరూపం చూపించు అరుణాచలేశ్వరుడా! నీ శాంతి చూపించు, నీ కాంతి చూపించు, నీ యొక్క అంతస్థు చూపించు అప్పుడు నా మనస్సు అణుగుతుంది. నీ కాంతి చూపించకపోతే ఈ మనస్సు ఎప్పుడూ చీకటిలోనే ఉండిపోతుంది. ఇలా ఊరూరు తిరుగుతూనే ఉంటుంది, శవాలను మోస్తూనే ఉంటుంది, జన్మిస్తూ ఉంటుంది, మరణిస్తూ ఉంటుంది. ఈ మనస్సు నాకు లొంగుతుందా? ఈ బంధాలు, సంకెళ్ళు తీయటానికి నువ్వే రావాలి. నా హృదయంలో ఉన్న బరువైన రాళ్ళు ఎత్తి బయటపడేయటానికి నువ్వే రావాలి, నీ కాంతిని చూపించాలి అప్పుడు నా మనస్సు అణుగుతుంది కానీ అప్పటివరకు ఇలా బయట తిరుగుతూనే ఉంటుంది.

**అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా**
**అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా**



**జ్ఞానం సత్యం - అజ్ఞానం అసత్యం.**

**జ్ఞానం నిత్యం - అజ్ఞానం అనిత్యం.**

**జ్ఞానం సుఖాన్ని ఇస్తుంది - అజ్ఞానం దుఖాన్ని ఇస్తుంది.**



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥2-58॥**

**తాత్పర్యము:** తాబేలు తన అంగములను అన్ని వైపుల నుండీ లోనికి ముడుచుకొనునట్లుగా, ఇంద్రియములను ఇంద్రియార్థముల (విషయాదుల) నుండి అన్ని విధముల ఉపసంహరించు కొనిన పురుషుని యొక్క బుద్ధి స్థిరముగా ఉన్నట్లు భావింపవలెను.

తాబేలుకి ఏదైనా ప్రమాదం వస్తుంది అనేటప్పటికి అది ఇంద్రియాలని సడన్‌గా లోపలకి లాగేసుకుంటుంది. భగవంతుడు ఎంత గొప్ప పోలిక ఇస్తున్నాడో చూడండి. తాబేలుకి భయం వేసినప్పుడు అది తన ఇంద్రియాలనిఎంత మృదువుగా, ఎంత నేర్పుగా, ఎంత తేలికగా లోపలికి లాక్కుంటుందో, అదే విధంగా విషయాలలో తిరుగుతున్నటువంటి తన ఇంద్రియాలని, బలవంతంగా కాదు, అంత తేలికగా ఏ సాధకుడు, ఏ దైవభక్తుడైతే లాక్కుంటున్నాడో వాడి ప్రజ్ఞ, వాడి తెలివి, వాడి బుద్ధి, వాడి మాటలు మాత్రమే నిలకడగా ఉంటాయి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మీరు చేస్తున్న పని కష్టంగా ఉంటే ఎక్కువ కాలం చెయ్యలేరు. తేలికగా ఉండాలి, సంతోషంగా ఉండాలి.

ఇంద్రియాలు సాధారణంగా విషయాలను పట్టుకుని ఉంటాయి. ఇంద్రియాలకి విషయాలే సర్వస్వం. మన అందరికీ కళ్ళు ఉన్నాయి కళ్ళతోటి చూస్తున్నాం అనుకుంటున్నాం ఇది అబద్ధం. కళ్ళు చూడటం లేదు, కళ్ళు ద్వారా మనసు చూస్తుంది. చెవులు ద్వారా మనసు వింటుంది. భగవంతుడు చెబుతున్న మాటల మీద అభిలాష లేకపోతే, మనసులో ఆ వాసన, ఆ సంస్కారం లేకపోతే, కళ్ళుండి చూడలేరు, చెవులుండి వినలేరు. మనస్సు ఎంతసేపూ ఇంద్రియాల ద్వారా బయటకి వచ్చెయ్యటానికి చూస్తుంది. బహిర్ముఖం అవ్వటానికి ఇంద్రియాలని, శరీరాన్ని మనస్సు ఉపయోగించుకుంటుంది. ఈ మనస్సు బాగు

పడటం కోసమే భగవంతుడి యొక్క నామాన్ని స్మరించమన్నారు. భగవంతుడి యొక్క నామంలో మీ మనసుని నానబెడితే అది స్వచ్ఛం అవుతుంది, మనస్సుకి స్వస్థత చేకూరుతుంది. మనసు బహిర్ముఖం అయ్యేకొలది మనం మాయలో. అజ్ఞానంలో పడిపోతున్నాం. మనకి చీకటి లోకాలు రెడీగా ఉంటాయి. అసలు సూర్యుడు ఉదయించడు అనుకోండి మన జీవితాలు ఎలా ఉంటాయి? అదేవిధంగా ఈ ఇంద్రియాలు గనుక విచ్చల విడిగాఉంటే, ఇంద్రియాలు స్వాధీనంలో లేకపోతే, మనం మరణించిన తరువాత చీకటి కోణాలలో, చీకటిలోకాలలో ఈ జీవుడు ఉండవలసిందే!

ఎదుటి వ్యక్తుల వల్ల, ఎదుటి పరిసరాల వల్ల మనకి వచ్చేవి నూటికి ముప్పై కష్టాలైతే. మిగతా డబ్బై కష్టాలు కూడా మన ఇంద్రియాల వల్లే, మన మనస్సులోనుంచే వస్తున్నాయి. అసలు నా ఇంద్రియాల వల్లే నా మనస్సు ఆ పరిస్థితిలో ఉంది అన్న సంగతి నాకే తెలియటం లేదు. నేనెలా బాగుపడతాను? బాగుపడాలంటే ముందు రోగ నిర్ధారణ అవ్వాలి, అది ముఖ్యం. అందుచేత మనం ఎదుటి వాళ్ల మీదకి, ఎదుట పరిసరాల మీదకి గెంటవద్దు. మనం అనుభవించవలసిన ప్రారబ్ధం ఏదైనా ఉంటే, ఈశ్వరుడు ఎదుటి వాడి చేత ఆ మాట అనిపిస్తాడు. వాడిలో కూడా ఈశ్వరుడు ఉన్నాడు. నన్ను నేను శిక్షించుకోను. కాని ఎదుటి వాడు కఠినమైన మాటలు అంటే కొన్ని కొన్ని వాసనలు నాకు తెలియకుండా జారిపోతాయి. ఎదుటివాడు కూడా నా ప్రారబ్ధాన్ని బట్టే సిద్ధం అవుతున్నాడు.

దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఎవరు ఏ కుటుంబంలో జన్మించాలో, ఎంత ప్రారబ్ధం అనుభవించి ఆ శరీరం విడిచి పెట్టాలో, ఇదంతా ఏమీ తేడా లేకుండా ఈశ్వరుడి యొక్క ప్రణాళిక ప్రకారం ఈ సృష్టి అంతా నడుస్తుంది. ఆత్మ యొక్క శక్తి అనంతమైనది. ఎవరైనా ఒక పది అంతస్తులు మేడ కడితేనే, పెద్ద గోపురం కడితేనే మనం ఆశ్చర్యపోతాము. మన కళ్లకి కనిపిస్తున్న ఈ విశాలమైన ప్రపంచాన్ని ఆత్మ సృష్టించి పరిపాలిస్తోంది. ఈ ప్రపంచాన్ని అంతా కూడా దానిలో లయం చేసుకుంటుంది. అటువంటి ఆత్మ నీ హృదయంలో ఉంది. దానిని (ఆత్మని) తెలుసుకుంటే ఎంత శాంతి కలుగుతుందో, ఎంత శక్తి కలుగుతుందో మీరు అర్థం చేసుకోండి.

కాలమాన పరిస్థితులు బట్టి, ఈ దేహం ఏ ప్రారబ్ధం అయితే అనుభవించి వలసి ఉందో, అది జరిగిపోతూ ఉంటుంది. దీనిమీద నువ్వు మనసు పెట్టుకోవద్దు. ఇది సృష్టి, అంటే కల్పించబడినది. అందుచేత మీరు ఆత్మరూపంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవ డానికి మీ టైము అంతా ఖర్చు పెట్టండి అని చెబుతున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. యదా సంహరతే ఎలాగైతే తాబేలు తన ఇంద్రియాలని లోపలకి తీసుకుంటుందో, అదే విధంగా నీ ఇంద్రియాలని లోపలకి లాక్కో అని చెబుతున్నాడు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సత్ప్రవర్తన

మంచిగా మానవత్వంతో జీవించుటకంటే మించిన గొప్ప తపస్సు లేదు. మనము సాటివారికి మంచిని చేయాలి, చేసిన మంచిని మరచిపోవాలి. మన మాటలతోకానీ, చేతలతోకానీ, ఎవ్వరినీ హింసపెట్టకూడదు. ఎదుటివారిని హింసపెడితే, పరిణామములో మనము హింసకు గురికాక తప్పదు. ఈ జన్మలో మనము చేసిన పనులే మరుజన్మలో మనకు ఎదురొస్తాయి. ధర్మమార్గంలో కపటము లేకుండా, సత్ప్రవర్తన కలిగి, చిత్తశుద్ధితో జీవిస్తూ ఉంటే ఇంద్రియములు స్వాధీనములోకి వచ్చి అంతర్దృష్టి కలిగి, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతాము. మన తలంపులే మనకు సంకెళ్ళు! జీవితంలో ఓర్పు, సహనం చాలా ముఖ్యం. జీవితంలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను, ద్వంద్వాలను, జయాపజయాలను, ఓర్పుతో సహజంగా, సమానముగా స్వీకరించాలి. ఓర్పు, సహనము గలవారు మాత్రమే హృదయపు లోతులలోకి దిగగలరు. ఇతరులకు దేనినొనర్తుమో అదియే మనకు లభించును. మనము వేప విత్తనములు నాటినచో దాని ఫలితముగా తియ్యటి మామిడిపండ్లు లభిస్తాయా? దేహప్రారబ్ధమును ప్రీతిగా అనుభవిస్తే, పాతవాసనలు నశించి క్రొత్త వాసనలు పుట్టవు. జ్ఞానమునకు ఇతరము లేదు కాబట్టి, ఇతరులను ప్రేమించడం, గౌరవించడం మన సహజలక్షణం కావాలి. పొయ్యి మీద పెట్టిన చిన్న పాత్రలు త్వరగా వేడెక్కుతాయి, అదేవిధముగా సంకుచిత మనస్సు గలవారు తొందరగా ఆవేశానికి, ఆందోళనకు, అశాంతికి గురి అవుతారు. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించడానికి ఆవేశముకన్నా ఆలోచన ముఖ్యము. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే దేహానికి ఆరోగ్యము లాగున, మనస్సుకి సహనము, ఓర్పు, అంతరదృష్టి అవసరము. ఎదుటివారు మనను కలతపెట్టినప్పటికీ మనము కంగారు పడకూడదు. అన్ని దానముల కంటే నిదానము గొప్పది. మనము ఎంతవరకు పక్వానికి వచ్చామో పరీక్షించుటకు మన మనస్సును నొప్పించేమాటలను ఎదుటివారిచేత గురువే అనిపిస్తూ ఉంటాడు, అందువల్ల ఎదుటివారి మాటలకు, విమర్శలకు ఆవేశపడకూడదుఅన్నీ మన మంచికే! వినయము లేనివాడు ఏ రంగములోనూ రాణించలేడు. సాటివారిని ప్రేమించడం, సాటివారిలో తప్పలను వెదకడం మానడం, సాటివారికోసం త్యాగం చేయడం, వారి కష్టాలలో పాలు పంచుకోవడం, మనకు లభించిన దానితో తృప్తి చెందడం, సృష్టిలో ఏ ప్రాణికి కీడు తలపెట్టకుండా ఉండడం, ఇదే నిజమైన పూజ.

**(సద్గురు శ్రీ నాన్నగారి ఉపదేశముల నుండి)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఆత్మ నీరాజనం

వడ్లవానిపాలెం శ్రీ సాగిరాజు రామచంద్రరాజు గారి కమనీయ శుచరితం నిష్కామ కర్మకు ప్రతీకగా శ్రీనాన్నగార్కి నీడలా, అంతేవాసిగా యాబది సంవత్సరాలు శ్రీ నాన్నగారి పాదసేవలో గడిపిన ధన్యజీవి. మొదట ఆంధ్రపత్రిక విలేఖరిగా, సిమెంటు డీలరుగా వ్యాపారజీవితం గడిపారు. వాటిని వదులుకొని ఆధ్యాత్మిక జీవనం వైపు మరలి శ్రీనాన్నగారి ప్రవచనాలు విని వారితో జీవిస్తూ, వాటిని గుట్టుగా, గుంబనంగా పరిశీలించి జీర్ణించుకొని కళంకం లేని వ్యక్తిగా జీవించారు. జిన్నూరు సత్సంగంలో 'రామచంద్రరాజుగారు నాకు తల్లి' అన్నారు నాన్నగారు. పూర్వం అర్థవరం గ్రామం నుంచి 'వడ్లు' బాగా పండుతాయనే వడ్లవానిపాలెం చేరుకొన్నారు. వారు సాగిరాజు వారే. మా కుటుంబ సభ్యులే. వారి కుటుంబీకులు అంతా శ్రీనాన్నగారి భక్తులే. అంతేకాదు ఉన్నత విద్యలో ఆరితేరి వ్యాపార రంగంలో రాణిస్తూ ఆనందంగా జీవిస్తున్నారు. వారు నైతిక విలువల ప్రాతిపదికగా జీవిస్తున్నారు. భార్యామణి ప్రక్క గ్రామం మునసబు గారి కుమార్తెగా రామచంద్రరాజుగారి ధర్మపత్నిగా భర్తకు నవవిధ సేవలు అందించారు. వారి ముగ్గురు కుమార్తెలను క్రమశిక్షణతో జీవింపజేసారు. జిన్నూరు సత్సంగంలో శ్రీనాన్నగారు 'నా జీవితంలో కొంచెం ఆలస్యంగా చేరినా నా తుదిశ్వాస వరకు నా సేవలోనే జీవిస్తారు' అన్నారు. అది అక్షర సత్యమైంది. శ్రీరామచంద్రరాజుగారు నాకు సోదరులుగా, నా కుటుంబానికి వారి కుటుంబానికి ప్రేమానురాగాలతో పెనవేసుకొన్నాయి. వారి ఆత్మీయత మరువలేను. నా వ్యాస రచనలో అక్షరం తప్పులు సరిజేస్తూ తగిన సూచనలు, సలహాలు తెలిపేవారు. రాజకీయ వార్తలు, సంఘ సామాజిక పరిస్థితులు, రోజూ ఫోనులో మాట్లాడుకుంటూ, నాతో వారు గురువుగారు ఇంకా ఏమైనా విశేషాలు ఉంటే చెప్పండి అనేవారు. ఆ విశ్లేషణలు ఆనందంగా నవ్వు పుట్టించేదిగా ఉండేది. అంతా బాగున్నారా అంటూ ముగించేవారు. రామచంద్రరాజుగారు వైకుంఠ ప్రాప్తి పొందారనే వార్తతో నా నోటిమాట రాలేదు. వారు శ్రీనాన్నగారి హృదయంలో కలసిపోయి ఆనందంగా ఉన్నారు. కాలాతీత స్థితికి చేరుకున్న పుణ్యచరితులు, ధన్యజీవి రామచంద్రరాజుగారు. జయమంగళం మీకు శుభ మంగళం.

**వారి ఆత్మీయ సోదరులు సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966**